కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు పరచాలి

హామీల అమలు కోసం పోరాటాలకు సిద్ధం కండి

- చలో అసెంబ్లీని నిర్వహిస్తాం

- పి.హరినాథ్ రెడ్డి, నాగసుబ్బారెడ్డిల పిలుపు

- వార్త మెయిన్‌లో

విశాలాంధ్ర

తిరుపతి జిల్లా

చిత్తూరు జిల్లా

ఆదివారం 10 నవంబరు 2024 8 పేజీలు

డిసెంబర్ 2024 నాటికి రాష్ట్రంలో

లక్ష ఇల్లు పూర్తి

- అప్పచెప్పే బృహత్తర కార్యక్రమం ముఖ్యమంత్రి చేతుల మీదుగా చేపట్టనున్నాం
- మంత్రి కొలుసు పార్థసారథి

డిసెంబర్ 2024 నాటికి రాష్ట్రంలో లక్ష ఇల్లు పూర్తిచేసి లబ్ధిదారులకు ఇంటి తాళం చెవులు అప్పచెప్పే బృహత్తర కార్యక్రమం ముఖ్యమంత్రి గారి చేతుల మీదుగా చేపట్టనున్నామని, అర్హులైన ప్రతి పేదవారికి ఇల్లు కల్పించాలనేది సిఎం చంద్రబాబు నాయుడు లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి పేర్కొన్నారు.

- వార్త మెయిన్‌లో

నామినేటెడ్ పదవుల జాతర

- తిరుపతికి నాలుగు... చిత్తూరుకు ఒకటి
- పార్టీ విధేయులకు ప్రాధాన్యత

విశాలాంధ్ర-తిరుపతి: నామినేటెడ్ పదవుల పంపిణీలో మొదటి విడతలో ఉమ్మడి చిత్తూరు జిల్లాకు న్యాయం జరగలేదని అసంతృప్తితో ఉన్న కూటమి శ్రేణులకు.. అధిష్టానం రెండో విడతలో ఐదుగురికి పదవులు కేటాయించి సంతృప్తి పరచడానికి ప్రయత్నం చేసింది. ఇందులో తిరుపతి జిల్లాకు నాలుగు, చిత్తూరు జిల్లాకు ఒక పదవి కేటాయించారు. తిరుపతి జిల్లాకు సంబంధించి... తిరుపతి పార్లమెంటు అధ్యక్షులు నరసింహ యాదవ్‌ను ఏపీ యాదవ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా నియమించారు. ఇక తిరుపతి పార్లమెంటు బీసీ విభాగం అధ్యక్షులు రుద్రకోటి సదాశివంను ఏపీ నాయీ బ్రాహ్మణ వెల్ఫేర్ అండ్ డెవెలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా నియమించారు. తిరుచానూరు మాజీ సర్పంచ్ సీఆర్ రాజన్‌ను ఏపీ వన్నెకుల క్షత్రియ కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కొర్పొరేషన్ లిమిటెడ్ ఛైర్మన్‌గా నియమించారు. ఈయనకు చంద్రగిరి నియోజ కవర్గం కోటా ఈ పదవి దక్కింది. తిరుపతికి చెందిన నీలాయపాళెం విజయకుమార్‌ను ఏపీ స్టేట్ బయో-డైవర్సిటీ బోర్డు ఛైర్మన్‌గా నియమించారు. ఇక చిత్తూరు జిల్లాకు సంబంధించి చిత్తూరు మాజీ మేయరు కటారి హేమతలను చిత్తూరు అర్బన్ డెవలప్‌మెంటు అథారిటీ ఛైర్ పర్సన్‌గా నియమించారు. ఈ ఐదుగురు కూడా తెలుగుదేశం పార్టీ వారే కావడం విశేషం.

కాగా నామినేటెడ్ పదవులు పొందిన నరసింహ యాదవ్, సీఆర్ రాజన్, కటారి హేమలత సాధారణ ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే టికెట్ కోసం తీవ్రంగా ప్రయత్నంచేశారు. అయితే అప్పటి రాజకీయ సమీకరణాలతో వీరికి ఎమ్మెల్యే టికెట్ దక్కలేదు. ఈ నేపథ్యంలో రెండో విడత నామినేటెడ్ పదవుల్లో వీరికి ప్రాధాన్యత కల్పించారని ఆ పార్టీ శ్రేణులు అభిప్రాయపడుతున్నాయి.

... సప్తవర్ణ శోభితం ...

శ్రీవారి పుష్పయాగం

- వార్త 8లో

అధికారమా... అహంకారమా...?

- గ్రామాల్లో చెలరేగుతున్న బెల్టు నిర్వాహకులు
- పోలీసుల అదుపులో బెల్టు వేలం పాట నిర్వాహకులు
- శ్రీధనమల్లి గ్రామంలో మొదలైన వివాదాలు
- చర్యలు తీసుకుంటారో లేదో వేచి చూడాలి

విశాలాంధ్ర-దొరవారిసత్రం: ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి రాష్ట్ర అభివృద్ధికి అదే విధంగా ఎన్నికలలో ఇచ్చిన హామీలను నిర్వహించేందుకు అధినేతలు శతవిధాలుగా ప్రయత్నాలు చేస్తుంటే క్షేత్ర స్థాయిలో ఉన్న కొందరు నాయకులు అధికారాన్ని అడ్డం పెట్టుకుని వాళ్ల ఇష్టారాజ్యంగా వ్యవహిరిస్తూ ప్రభుత్వానికి మచ్చ తెస్తున్నారని పలువురు అంటున్నారు. బెల్టు దుకాణాలు నిర్వహించే వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పదే పదే ఆదేశాలు జారీ చేసినా క్షేత్ర స్థాయిలో మాత్రం బెల్టు షాపులు పుట్టగొడుగుల్లా పెరుగుతూనే ఉన్నాయి.

2లో

రాయల చెరువును....

పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తాం

- రాయల చెరువు కట్టపై చేపల వ్యాపారులకు షెడ్లు ఏర్పాటు
- పర్యాటకులను ఆకర్షించే విధంగా రాయల చెరువు కట్టను సుందరంగా తీర్చిదిద్దుతాం
- డ్రాగన్ బోటింగ్, కయా కింగ్ వాటర్ స్పోర్ట్స్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే, శాప్ ఛైర్మన్

విశాలాంధ్ర - తిరుపతి రూరల్:

రాష్ట్రంలోనే అతి పెద్దదైన రాయల చెరువును పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తామని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు .రాష్ట్ర క్రీడాభి వృద్ధి సంస్థ (శాప్) ఛైర్మన్ రవి నాయుడుతో కలిసి శనివారం ఎమ్మెల్యే నాని రాయల చెరువును పరిశీలించారు. ఎమ్మెల్యేతో పాటు మాజీ తుడాచైర్మన్ నరసింహ యాదవ్ ఉన్నారు. రాయల చెరువు పర్యటనకు వచ్చిన ఎమ్మెల్యేకి, శాప్ ఛైర్మన్‌కి మండల కూటమి పార్టీల నాయకులు అపూర్వ స్వాగతం పలికారు.

2

పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తాం

(మొదటి పేజీ తరువాయి) డ్రాగన్ బోటింగ్, కయాకింగ్ వాటర్ స్పోర్ట్స్ సంస్థ డైరెక్టర్ ప్రదీప్ కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డ్రాగన్ బోటింగ్,కయాకింగ్ పోటీలను శాప్ చైర్మన్‌తో కలిసి ఎమ్మెల్యే నాని ప్రారంభించారు. లైఫ్ జాకెట్లను ధరించి బోట్లలో రాయలచెరువు అంతా కలియతిరిగారు. అనంతరం ఎమ్మెల్యే చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని మాట్లాడుతూ పర్యాటకులను ఆకర్షించే విధంగా రాయల చెరువు కట్టను సుందరంగా తీర్చిదిద్దుతామని తెలిపారు.2021లో సంభవించిన తుఫాను కారణంగా రాయలచెరువు కట్ట తెగుతుందనే సోషల్ మీడియాలో ప్రచారం చేయించి ప్రభుత్వం నుంచి నిధులను మంజూరు చేయించుకుని లబ్ది పొందారని చెప్పారు.ఈ విషయాలన్నీ విన్న పెద్దాయన ప్రతిపక్ష నేతగా ఉండిన చంద్రబాబు నాయుడు రాయలచెరువు కట్ట ప్రాంతాన్ని పర్యటించారు. తాను ముఖ్యమంత్రి అయిన తర్వాత రాయల చెరువును పర్యాటక కేంద్రంగా రూపుదిద్దుతామని చెప్పారని, ఆ మాటకు కట్టుబడి చెరువు అభివృద్ధికి త్వరలోనే పనులు ప్రారంభించడం జరుగుతుందని వివరించారు.అంతే కాకుండా ఆహ్లాదకరమైన వాతావరణంలో 32 ఎకరాలలో జాతీయ, అంతర్జాతీయ క్రీడలను నిర్వహించేందుకు ఏర్పాట్లను చేయడం జరుగుతుందని ఎమ్మెల్యే తెలియజేసారు. మంచి వాతావరణం, ప్రకృతి అందాలు వీక్షిస్తూ చక్కటి వాతావరణంలో పర్యాటకులకు కనువిందు చేసే విధంగా ఇక్కడి వాతావరణం రూపొందిస్తున్నట్లు చెప్పారు. ఆహ్లాదం కోసం వచ్చే పర్యాటకులకు, తిరుమల ఆటవిడుపును పెంచటానికి చక్కటి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దటానికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఇందుకోసం ఇప్పటికే ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు వివరించారు.ఇక్కడ వాటర్ స్పోర్ట్స్ ప్రారంభమైతే ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందగలదని ఆశాభాగం వ్యక్తం చేశారు.ఆహ్లాదం కోసం వచ్చే పర్యాటకులకు, ఆటవిడుపును పెంచటానికి చక్కటి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దటానికి నిధులు మంజూరు చేయించడానికి కృషి చేస్తామని శాప్ చైర్మన్ రవి నాయుడు తెలిపారు. ఇక్కడ స్థానిక యువతకు కూడా క్రీడలలో శిక్షణ ఇచ్చి వివిధ పోటీల్లో పాల్గొని ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దటానికి కృషి చేయటానికి డ్రాగన్ బోర్డు మరియు కయాకింగ్ డైరెక్టర్ ప్రదీప్ సిబ్బందితో సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కూటమి మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అహంకారమా...?

(మొదటి పేజీ తరువాయి) ముఖ్యంగా ప్రభుత్వ నిబంధనల ప్రకారం బెల్టు షాపులకు మందు సరఫరా చేసే దుకాణాల లైసెన్సులు కూడా రద్దు చేస్తామనే ఆదేశాలను భేఖాతర్ చేస్తూ విచ్చలవిడిగా బెల్టు ఏర్పాటుకు బహిరంగానే వేలం పాటలు నిర్వహించి అడ్డుకున్న వారిపై వివాదాలకు దిగుతున్నారు. తిరుపతి జిల్లా దొరవారిసత్రం మండలంలోని శ్రీధనమల్లి గ్రామంలో బెల్ట్ షాపు ఏర్పాటుకు రచ్చబండ వద్ద తెలుగు తమ్ముళ్లు బహిరంగ వేలం పాట నిర్వహించారు. ఈ వేలం పాటలో 1.60 లక్షల రూపాయిలను అదే గ్రామానికి చెందిన మణికంఠ బెల్ట్ నిర్వహించేందుకు పాట పాడారు. అయితే ఈ విషయంపై పత్రికలో కథనాలు రావడంతో శనివారం సూళ్లూరుపేట ఎక్సైజ్ పోలీసులు, డీవీసత్రంలో పోలీసులు శ్రీధనమల్లి గ్రామానికి వెళ్లి అక్కడ బెల్టు ఏర్పాటుకు నిర్వాహకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

గ్రామాల్లోకి బెల్టు ఎక్కడ నుంచి వస్తుంది..?

దొరవారిసత్రం మండలంలోని 65 గ్రామాల్లో సుమారు 36,320 మంది జనాభా ఉన్నారు. ప్రభుత్వం నిబంధనల ప్రకారం డీవీసత్రం మండలానికి రెండు మద్యం షాపులను కేటాయించారు. అయితే ఈ రెండు మద్యం షాపులు అధికారికంగా నిర్వహిస్తే అనధికారికంగా సుమారు 40 బెల్టు షాపులను ఊరూరా నిర్వహిస్తున్నారు. మండలంలోని గ్రామాల్లో నిర్వహిస్తున్న ఈ బెల్ట్ షాపులకు మందు ఎక్కడ నుంచి సరఫరా అవుతుంది. డీవీసత్రంలో ఉన్న మద్యం దుకాణాల ద్వారా వస్తుందా.. లేదా బయట నుండి పంపిణీ అవుతుందా అనేది అందరు గుసగుసలాడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు బెల్టుపై ఉక్కుపాదం మోపుతారా.. లేదా నాయకుల ఒత్తిడులకు బలి అయి వదిలేస్తారో వేచి చూడాలి.

వైభవంగా శ్రీ భూ సమేత మలయప్ప స్వామికి స్నపన తిరుమంజనం

విశాలాంధ్ర-తిరుమల కల్చరల్: తిరుమల శ్రీవారి ఆలయంలో శనివారం ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్ప స్వామి ఉత్సవ మూర్తులకు వైభవంగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. పుష్పయాగం సందర్భంగా ఉదయం 9 నుంచి 11 గంటల వరకు స్వామి అమ్మవార్లకు స్నపనం నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితులు శ్రీ, భూ, పురుష, నీల, నారాయణ సూక్తాలను మంత్రోచ్చారణలతో, ఉత్సవమూర్తులకు పాలు, పెరుగు, పసుపు, చందనం లతో పాటు సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేశారు. తిరుమల జీయర్ స్వామీజీల సమక్షంలో ఆలయ ప్రధాన అర్చకులు గోవిందరాజ దీక్షితులు పవిత్రోత్సవాలు నిర్వహించారు. అనంతరం నక్షత్ర హారతి, కుంభ హారతి, ప్రత్యేక హారతి సమర్పించి ఆచారం ముగిసింది.అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చెవిరెడ్డి జన్మదిన వేడుకలు

-100 కేజీల భారీ కేక్ కట్ చేసిన మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి

- వందలాదిగా తరలివచ్చిన పార్టీ నేతలు, కార్యకర్తలు

విశాలాంధ్ర-తిరుపతి రూరల్: తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంట గ్రామంలో చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి జన్మదినవేడుకలు ఘనంగా జరిగాయి. శనివారం ఉదయం నుంచే పార్టీ నాయకులు, కార్యకర్తలు చెవిరెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని ఆయన ఇంటికి క్యూ కట్టారు. పుష్ప గుచ్చాలు, శాలువలు, నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు తమ వెంట తీసుకువచ్చి ఆయనకు కానుకగా ఇస్తూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పెద్ద ఎత్తున టపాకాయలు పేల్చి చెవిరెడ్డి జన్మదిన వేడుకలను అట్టహాసంగా నిర్వహించారు. చంద్రగిరి నియోజకవర్గంతో పాటు తిరుపతి, చిత్తూరు జిల్లాల నుంచి పార్టీ ముఖ్యనేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున చెవిరెడ్డి ఇంటికి చేరుకుని జన్మదిన శుభాకాంక్షలు తెలియపరిచారు. ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మాజీ ఎంపీపీలు, సర్పంచ్ లు అందరూ చెవిరెడ్డిని కలుసుకుని భవిష్యత్తు కాలం అందరికీ మంచి జరగాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు చెప్పారు. 100 కేజీల భారీ కేక్ కట్ చేసిన చెవిరెడ్డి...చెవిరెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని 100 కేజీల భారీ కేక్ ను బహుమతిగా తీసుకువచ్చిన అభిమానులు ఆయనతో పాటు కుటుంబ సభ్యులు అందరినీ వేదికపైకి తీసుకువచ్చి కట్ చేయించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు అందరి సమక్షంలో 100 కేజీల భారీ కేక్ కట్ చేసిన చెవిరెడ్డికి ఆయన అభిమానులు జేజేలు పలుకుతూ తమ ఆనందాన్ని పంచుకున్నారు. కేక్ కటింగ్ పూర్తయిన తరువాత పార్టీ నేతలు, కార్యకర్తలతో చెవిరెడ్డి ఆత్మీయంగా మాట్లాడుతూ టిఫిన్ చేసి వెళ్లాలని, మజ్జిగ, జ్యూస్ తాగాలని ప్రతి ఒక్కరికీ ఆయనే స్వయంగా చెప్పడం అక్కడకు వచ్చిన వారందరినీ ఆకట్టుకుంది. తమ నాయకుడు నిండునూరేళ్ళు సుఖంగా జీవించాలని పలువురు పార్టీ నేతలు, కార్యకర్తలు ఆలయాల్లో పూజలు చేసి ఆశ్రమాల్లో దుస్తులు పంపిణీ చేశారు. పార్టీ నేతలు, కార్యకర్తలు తీసుకువచ్చిన నోటు పుస్తకాలు, పెన్నులు, ఇతరత్రా విద్యా సామాగ్రిని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న పేద విద్యార్థులకు పంపించేయాలని తన సిబ్బందికి చెవిరెడ్డి సూచించారు.

ఏఐఎస్ఎఫ్ నూతన కమిటీ

విశాలాంధ్ర-సూళ్లూరుపేట: అఖిల భారత విద్యార్థి సమైక్య ఏఐఎస్ఎఫ్ సూళ్లూరుపేట నియోజకవర్గ నూతన కమిటీని ప్రతిభ జూనియర్ కళాశాల నందు 7 మందితో నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా కార్యదర్శి ప్రవీణ్, జిల్లా సహాయ కార్యదర్శి తేరే సూర్య పాల్గొన్నారు. సూళ్లూరుపేట నియోజకవర్గ అధ్యక్షులుగా ముని శివ, కార్యదర్శిగా తేరే సూర్య, ఉపాధ్యక్షులుగా హేమంత్ సహాయ కార్యదర్శులు కిరణ్, చరణ్, కోశాధికారిగా ప్రభాకర్, మౌళి లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.

గ్రావెల్ టిప్పర్లకు జరిమానా

విశాలాంధ్ర-సత్యవేడు: సత్యవేడు మండలం మదనంజేరి గ్రామానికి సమీపంలో క్వారీ నుంచి అక్రమంగా తరలిపోతున్న ఐదు గ్రావెల్ ట్రిప్పర్లకు జిల్లా మైన్స్, మోటార్ వెహికల్ శాఖ అధికారులు రూ.5.20 లక్షలు జరిమానా విధించినట్లు స్థానిక ఎస్సై రామస్వామి తెలిపారు. నవంబర్ 4వ తేదీన ఎస్ఐ రామస్వామి ఆధ్వర్యంలో పోలీసు బృందం సత్యవేడు -ఊతుకోట ప్రధాన రోడ్డు మార్గం లో వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ నేపథ్యంలో ఐదు గ్రావెల్ ట్రిప్పర్లను ఆపి రికార్డులను పరిశీలించగా గ్రావెల్ తరలింపు నకు సంబంధించిన రికార్డులు సక్రమంగా లేకపోవడాన్ని ఎస్ఐ గుర్తించారు. ఈ నేపథ్యంలో సిఐ మురళి నాయుడు సూచనల మేరకు ఐదు గ్రావెల్ ట్రిప్పర్లను స్వాధీనం చేసుకొని సీజ్ చేయడం జరిగింది. ఇందుకు సంపాదించిన నివేదికను జిల్లా మైన్స్, మోటారు వెహికల్ శాఖ అధికారులకు పంప డంతో శనివారం అక్రమ గ్రావెల్ ట్రిప్పర్లు ఒక్కొక్కటికి రూ.1.04 లక్షల చొప్పున జరి మానా విధించినట్లు ఎస్ఐ రామస్వామి వివ రించారు. అక్రమ గ్రావెల్ తరలింపును ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించేది లేదన్నారు.

సోషల్ మీడియాలో వదంతులు వద్దు : ఎమ్మెల్యే

విశాలాంధ్ర -వెదురుకుప్పం: లేనిపోని వదంతులను సోషల్ మీడియా లో పోస్టులను పెట్టొద్దని జీడి నెల్లూరు ఎమ్మెల్యే డా థామస్ క్యాడర్ ను సున్నితంగా హెచ్చరించారు. టిడిపి పార్టీ లో సీనియర్లు, కొత్తగా చేరిన వారు ప్రాధాన్యత గురించి కొందరు సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు.ఈ క్రమంలో ఎమ్మెల్యే స్పందించి మాట్లాడుతూ పార్టీ నాయకులు,కార్యకర్తలు ఏ సమస్య వున్నా తమ దృష్టికి తీసుకురావాలని అన్నారు.పార్టీ లోని కార్యకర్తల అంతర్గత విషయాలు వాట్సప్ ల ద్వారా తప్పుడు మెసేజ్ లు పెడితే ఎలా అని ప్రశ్నించారు.రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రాష్ట్రం లో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ నూతన విధానాలు తో ప్రజలకు సరికొత్త పథకాలు అందిస్తున్నారు.అలాంటివి ప్రజలకు చేరవేయ్యాలన్నారు.గ్రామాల్లో ఏమి చేస్తే అభివృద్ధి జరుగుతుందో తమ దృష్టికి తెచ్చి పనులు చేపట్టి ప్రజాదరణ పొందాలని అన్నారు.అదే విధంగా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం కు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు.పార్టీ అభివృద్ధి కి కష్టపడి పని చేసిన వారికి ప్రతి ఒక్కరికి ప్రాధాన్యత ఉంటుందన్నారు.చౌకబారు విషయాలు సోషల్ మీడియాలో పోస్టులు చేసి పార్టీ ప్రతిష్ఠ కు భంగం కలిగిస్తే సహించేది లేదని,అలా చేసే వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో నేపాల్ కూలి మృతి

విశాలాంధ్ర-తడ : బతుకు తెరువు కోసం కూలీ పనికి వచ్చిన నేపాల్ కి చెందిన వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సంఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. తడ ఎస్ఐ కొండపరాయుడు సమాచారం మేరకు నేపాల్ కు చెందిన దమ్మురే పరియార్(53) బ్రతుకు జీవనం కోసం తడ మండల పరిధిలోని పుడిగ్రామం లో ఓ పరిశ్రమ లో కూలీ పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు.శుక్రవారం రాత్రి పని ముగించుకుని జాతీయ రహదారి నీ దాటుచుండగా అతివేగంగా వచ్చిన కారు ఢీ కొనడం తో తీవ్ర గాయాలు పాలవ్వగా స్థానికులు చికిత్స కోసం సూళ్లూరుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం చెన్నై స్టాన్లీ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడని వారి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు

మాజీ జడ్పీటీసీ దండోలు భక్తవత్సలరెడ్డి తుదిశ్వాస

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి మండలం ఎగువవీధికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత దండోలు భక్తవత్సలరెడ్డి (86) అనారోగ్యంతో శనివారం వేకువ జామున తుది శ్వాస విడిచారు. దండోలు భక్తవత్సలరెడ్డి గతంలో శ్రీకాళహస్తి మండల జడ్పీటీసీగా పని చేశారు. అదేవిధంగా ఏపీ సీడ్స్ డైరెక్టరుగా కూడా ఆయన బాధ్యతలు నిర్వర్తించారు. తెలుగుదేశంపార్టీ శ్రీకాళహస్తి మండల అధ్యక్షులుగా 25ఏళ్ల పాటు పని చేశారు. అదేవి ధంగా తొట్టంబేడు సమితి ఉపాధ్యక్షులుగా కూడా పనిచేశారు. ఈయన రాజకీ యాల్లో చాలా నిజాయితీగా ఉండేవారని పేరుంది. దివంగంత మంత్రి బొజ్జల గోపాల కృష్ణారెడ్డితో ఈయన చాలా సన్నిహితంగా ఉండేవారు. బొజ్జల గోపాలకృష్ణారెడ్డి ఈయన నుంచి రాజకీ యంగా, అభివృద్ధి పనుల గురించి సూచనలు సలహాలు కూడా తీసుకునే వారు. దండోలు భక్తవత్సలరెడ్డి తన సుదీర్ఘ రాజకీయ జీవితంలో అవినీతి మచ్చ ఏనాడూ అంటించుకోలేదు. దండోలు భక్తవత్సలరెడ్డి మృతి పట్ల శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి సంతాపం తెలియచేశారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకున్నారు. దండోలు భక్తవత్సలరెడ్డి సేవలను ఆయన గుర్తు చేసుకు న్నారు. భక్తవత్స లరెడ్డి మృతి పట్ల శ్రీకాళహస్తి మాజీ శాసనసభ్యులు ఎస్సీవీనా యుడు, బియ్యపు మధుసూ దనరెడ్డి కూడా సంతాపం తెలియజేశారు. శ్రీకాళహస్తి, తొట్టంబేడు, ఏర్పేడు, రేణిగుంట మండలాలకు చెందిన పలువురు టీడీపీ నేతలు ఎగువవీధికి వచ్చి దండోలు భక్తవత్సలరెడ్డి భౌతిక కాయానికినివాళులుఅర్పించారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకున్నారు.

టోర్నమెంట్ విజయవంతం చేయండి

- ఎన్ఐసి కోచ్ బి.జనార్ధన్

విశాలాంధ్ర-బుచ్చినాయుడు కండ్రిగ: సత్యవేడు నియోజకవర్గం వాలీబాల్ మరియు కబడ్డి టోర్నమెంట్ విజయవంతం చేయాలని ఎన్.ఐ.సి కోచ్ బి.జనార్ధన్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం మండల పార్టీ అధ్యక్షుడు మామిళ్ళపల్లి సుధాకర్ నాయుడు సహకారంతో నియోజకవర్గం టోర్నమెంట్ నిర్వహిస్తున్నామన్నారు. ఈ టోర్నమెంట్ సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానము నందు 'వి' స్పోర్ట్స్ క్లబ్ వారి ఆధ్వర్యంలో నిర్వహించబడుతుందన్నారు. వాలీబాల్ మరియు కబడ్డీ పోటీలలో అండర్-14 కబడ్డీ బాల బాలికలు మరియు అండర్-17 వాలీబాల్ బాలురు మాత్రమే పాల్గొనాలన్నారు. ఈ టోర్నమెంట్‌లో పాల్గొనే విద్యార్థులకు ఎటువంటి ఎంట్రీ ఫీజు లేదని, రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ప్రతి ఒక్క టీం ముందుగా అండర్-14 బాల బాలికలు కచ్చితంగా ఐదు అడుగులు పొడవు 45 కేసులోపు ఉండాలి, ఒక పాఠశాల వాళ్లే పాల్గొనాలి, ప్రతి ఒక్క విద్యార్థి ఒరిజినల్ స్టడీ సర్టిఫికెట్ ప్రధానోపాధ్యాయుడు ముద్రతో కూడిన సంతకముతో వివరాలు తీసుకుని రావాలన్నారు. ఈ క్రీడా టోర్నమెంటులో వ్యాయామ ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొనాలని తెలిపారు.

కంకర క్వారీలను పరిశీలించిన జిల్లా మైన్స్ ఏడి

అక్రమాలు వెలుగుచూడడంతో మూసివేతకు చర్యలు

విశాలాంధ్ర-సత్యవేడు: సత్యవేడు మండలం చమర్తి కండ్రిగలో నడుస్తున్న పలు కంకర క్వారీలను జిల్లా మైన్స్ అధికారులు పరిశీలించినట్టు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ నేపథ్యంలో జిల్లా మైన్స్ ఏడి బాలాజీ నాయక్ ఆధ్వర్యంలో అధికారుల బృందం గురువారం సాయంత్రం చమర్తికండ్రిగ గ్రామానికి చేరుకున్నారు. సమీపంలో కొనసాగుతున్న సెవెన్ హిల్స్, ఎస్ఎల్బి దామోదరం కంకర క్వారీలను పరిశీలించారు. అయితే ఈ రెండు కంకర క్వారీలలో అనేక అక్రమాలు జరుగుతున్నట్టు మైన్స్ అధికారుల పరిశీలనలో బయటపడ్డట్టు సమాచారం. ప్రధానంగా క్వారీ నుంచి వెలికితీస్తున్న కంకరకు సంబంధించి ప్రభుత్వానికి చెల్లిస్తున్న రాయల్టీకి భారీవ్యత్యాసాలు వెలుగు చూసినట్టు తెలిసింది. దీంతోపాటు కంకర తరలింపు వేబిల్లుల్లోనూ అక్రమాలు చోటు చేసుకుంటున్నట్టు విశ్వసనీయ సమాచారం. దీంతో సెవెన్ హిల్స్, ఎస్ఎల్బి దామోదరం క్వారీలను తాత్కాలికంగా మూసివేయడానికి జిల్లా మైన్స్ ఏడి బాలాజీ నాయక్ తగు చర్యలు చేపట్టినట్టు తెలిసింది. ఇందులో భాగంగా దీనిపై మైన్స్ అధికారులు స్థానిక పోలీసుల సహకారం కోరినట్లు సమాచారం. ఏది ఏమైనా చమర్తికండ్రిగ ఎస్టి కాలనీ సమీపంలో నడుస్తున్న సెవెన్ హిల్స్ కంకర క్వారీ అక్రమాలకు అడ్డు అదుపు లేకుండా పోతున్నట్టు ఆరోపణ వినిపిస్తున్నాయి. ప్రతినిత్యం వందలాది టిప్పర్ల ద్వారా కంకరను తమిళనాడుకు తరలిస్తున్నారు. ఈ క్వారీ నుంచి వెలికి తీస్తున్న కంకరకు తగ్గట్టు ప్రభుత్వానికి రాయల్టీ చెల్లింపులో ప్రభుత్వానికి సంబంధిత యాజమాన్యం కుచ్చుటోపి పెడుతున్నట్టు ఆరోపణలు లేకపోలేదు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతుంది. పైగా సెవెన్ హిల్స్ క్వారీలో కంకర తవ్వకాలు కూడా అటవీ రేంజ్ పరిధిలోకి వెళ్లినట్టు ఆరోపణ రావడంతో దీనిపై కూడా కేసు నడుస్తున్నట్టు సమాచారం. ఏది ఏమైనా అక్రమాలు బయటపడడంతో సెవెన్ హిల్స్, ఎస్ఎల్బి కంకర క్వారీలు నడవకుండా మూసివేయడానికి చర్యలు వేగవంతమయ్యాయి.

పాఠశాలకు చేయూత

విశాలాంధ్ర-గూడూరు: గూడూరు పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థులు ఐదు వేల రూపాయలు విలువ చేసే ఫ్లోర్ మ్యాట్స్‌ను అందచేశారు. ఈ కార్యక్రమానికి దాతగా పూర్వ విద్యార్థులు వాకాటి రామ్మోహన్, పసుపులేటి ప్రసాద్‌లు వ్యవహరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేవా దృక్పథాన్ని అలవరచు కోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు భారతి, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

నూతన బస్ సర్వీసును ప్రారంభించిన ఎమ్మెల్యే థామస్

విశాలాంధ్ర - పాలసముద్రం: మండలంలోని నరసింహపురం నుండి బెంగళూరుకు నూతన బస్ సర్వీసును శనివారం గంగాధర్ నెల్లూరు నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ థామస్, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి భీమినేని చిట్టిబాబు నాయుడుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారథ్యంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో పరుగులు పెడుతున్నదని గత ప్రభుత్వంలో ఎక్కడ చూసినా అరాచక పాలన కొనసాగిందని దీంతో ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడ్డారన్నారు. కూటమి ప్రభుత్వంలో ఈ రాష్ట్రం ఎంతో ప్రశాంతంగా ఉందని యువతకు మంచి భవిష్యత్తు కల్పిం చారని ప్రతి పేదవాడు ఆర్థి కంగా ఎదిగేందుకు మంచి సంక్షేమ పథకాలు తీసుకువచ్చారని పోలవరం ప్రాజెక్టు పనులు వేగంగా జరుగుతున్నాయని ఇదే విధంగా రాష్ట్రం ఉండాలంటే మరొకసారి కూడా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు రూప శ్రీ, సంపత్, చిరంజీవి, టిడిపి నాయకులు శేఖర్ రాజు అరుల్ నాదన్ తంగరాజ్ బొజ్జయ్య రవి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదును వేగవంతం చేయండి

- మండల పార్టీ అధ్యక్షుడు మాధవరెడ్డి

విశాలాంధ్ర-పుంగనూరు: మండల పరిధిలో నియోజవర్గ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి ఆదేశాల మేరకు టిడిపి మండల పార్టీ అధ్యక్షులు మాధవరెడ్డి మండల పరిధిలో టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని జోరుగా నిర్వహించడం జరిగింది. అందులో భాగంగా ఆయన శనివారం బండపల్లి పంచాయతీలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. అనేకమంది ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు వంద రూపాయలు చెల్లించి సభ్యత్వ నమోదు చేసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా మాధవరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రం లోని సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పుంగనూరు మండలం మొదటి స్థానంలో నిలవాలని, ఆ దశగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని కోరడం జరిగింది. సభ్యత్వ నమోదు చేసుకున్న ప్రతి ఒక్కరికీ ఐదు లక్షల రూపాయల బీమా సౌకర్యం పార్టీ కల్పిస్తున్నదని తెలియజేశారు. కార్యకర్తల సంక్షేమమే లక్ష్యంగా పార్టీ అధిష్టానం అనేక కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఈ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గంగాధర్, హరి, వెంకటరమణ, రెడ్డప్ప తదితరులు పాల్గొన్నారు.

గర్భిణీలకు పౌష్టికాహారం పంపిణీ

విశాలాంధ్ర-గూడూరు: గూడూరు జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో గూడూరు పట్టణంలోని ఏరియా ఆసుపత్రి నందు గర్భిణీలకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి దాతగా నెల్లూరు ఎల్ఐసి నందు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రవికుమార్ వ్యవహరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డాక్టర్ షరీనా, రవికుమార్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ గతంలో తాను గూడూరు ఎల్ఐసిలో పనిచేసేటప్పుడు జన విజ్ఞాన వేదిక బాధ్యతలు తీసుకొని అక్షరాస్యత, బడిబాట వంటి కార్యక్రమాలు చేశా నని, ఈ నెలలో తమ పాప పుట్టినరోజు సందర్భంగా గర్భిణీ స్త్రీలకు భోజన పంపిణీ చేసే అవకాశం కల్పించిన జే.వి.వి. గూడూరు వారికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేస్తున్నానని తెలిపారు. అనంతరం గర్భిణీలకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జే.వి.వి. అధ్యక్షులు వేగూరు రాజేంద్రప్రసాద్, చెంచు నారాయణ, ప్రభాకర్, రాధయ్య, గుర్రం విజయబాబు, అశోక్, సుబ్బారావు, జగదీష్, శ్రీనివాసచారి, సాయి పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

విశాలాంధ్ర-గూడూరు: గూడూరు పట్టణంలోని ఓం సాయిరాం చారిటీస్ వృద్ధాశ్రమం నందు ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దాతగా మెడనూరు సురేష్ రెడ్డి, శాంతి దంపతులు వ్యహరించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్ మాట్లాడుతూ పేదలకు సేవ చేయడం లోనే సంతృప్తి అని పేర్కొన్నారు. యువత సేవా కార్యక్రమాలపై దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు శ్రీనివాసులు, రాథయ్య, రాము, కె.ఆర్.ఏం, మురళీ నాయుడు, ప్రభాకర్, నాగరాజు, కృష్ణ రెడ్డి, ముని ప్రసాద్, శ్రీహరి, వాకటి శ్రీనివాసులు, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

కంటైనరును ఢీకొన్న కారు - బాపట్ల జిల్లా వాసి దుర్మరణం

- మరొకరికి తీవ్ర గాయాలు

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి మండలం ఊరందూరు వద్ద పూతలపట్టు- నాయుడుపేట జాతీయ రహదారిపై శుక్రవారం అర్ధరాత్రి తరువాత జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు దుర్మరణం చెందగా... మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఇంకొకరు స్వల్పంగా గాయపడ్డాడు. శ్రీకాళహస్తి డీయస్పీ నరసింహమూర్తి, గ్రామీణ సీఐ రవి నాయక్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. బాపట్ల జిల్లా బల్లికురవ మండలం వైదాన గ్రామానికి చెందిన ముత్యాల వీరాంజనేయులు (50), సంతమాగలూరు మండలం రామేపల్లికి చెందిన గుండపనేని రంగారావు (52), సంతమాగలూరుకు చెందిన గంధం కృష్ణమూర్తి (53) అనే వారు స్విఫ్ట్ కారులో తిరుపతి వైపు నుంచి బాపట్లకు వెళుతుండగా... శ్రీకాళహస్తి మండలం ఊరందూరు ఫ్లై ఓవరుపై ఆగి ఉన్న ఓ కంటైనరును కారు (ఏపీ 27బీఎఫ్ 2349) ఢీ కొంది. ఈ ప్రమాదంలో కారు నడుపుతున్న యజమాని ముత్యాల వీరాంజనేయులు అక్కడే దుర్మరణం చెందాడు. ఈ ప్రమాదంలో గుండపనేని రంగారావు తీవ్రంగా గాయపడ్డాడు. గంధం కృష్ణమూర్తి స్వల్పంగా గాయపడ్డాడు. కంటైనరు డ్రైవరు నిర్లక్ష్యంగా రోడ్డుపై వాహనం నిలపడం వల్లనే ఈ ప్రమాదం జరిగిందని సీఐ రవి నాయక్ చెప్పారు. ప్రమాదంలో మృతి చెందిన ముత్యాల వీరాంజనేయులు భౌతిక కాయాన్ని పోస్టు మార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ప్రభుత్వ ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన గుండపనేని రంగారావును మెరుగైన చికిత్స కోసం తిరుపతికి తరలించారు. ఈ ప్రమాదంపై శ్రీకాళహస్తి గ్రామీణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముక్కంటి అన్నదానానికి లక్ష విరాళం

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి శనివారం హైదరాబాదుకు చెందిన పుప్పల విజయ్ అనే భక్తుడు తన తండ్రి పరమేశ్వరరావు పేరున రూ.1 లక్ష విరాళంగా అందించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి టి.బాపిరెడ్డి ఈ విరాళం స్వీకరించారు. దాతకు కృతజ్ఞతలు తెలియజేసి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం స్వామి అమ్మవార్ల తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతి పార్లమెంటు టీడీపీ ఎస్టీ విభాగం అధ్యక్షులు సుబ్బయ్య పాల్గొన్నారు.

వినతుల స్వీకరణ

విశాలాంధ్ర-గూడూరు: గూడూరు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం లో గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ ప్రజల నుండి వినతులు స్వీకరించారు. అనంతరం సంబధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి త్వరితగతిన సమస్యను పరిష్కరించాలని తెలిపారు.

చిరుత దాడిలో మరో పాడావు మృతి

విశాలాంధ్ర-చౌడేపల్లి: చిరుతదాడిలో మరో పాడావు మృతి చెందిన సంఘటన శనివారం చౌడేపల్లి మండలంలో చోటుచేసుకుంది. బాధిత రైతు కథనం మేరకు... మండలంలోని పెద్ద కొండామరి పంచాయతీ నాగిరెడ్డిపల్లికి చెందిన వెంకట రమణారెడ్డికి పాడి ఆవులు ఉన్నాయి. వాటిని సమీపంలోని కందూరు బీట్ అడివిలోకి మేత కోసం తరలించారు. సాయంత్రం పశువులన్నీ ఇల్లుకు చేరుకోగా పాడావు కనిపించకుండా పోయింది. దీంతో చుట్టుపక్కల వెతికిన ఫలితం లేకపోవడంతో ఇంటికి వచ్చేసారు. అనంతరం చిరుత దాడిలో మృతి చెందిన ఆవును గుర్తించిన పశువుల కాపర్లు రైతుకు తెలియజేశారు. లబోదిబోమంటూ రైతు వెళ్లి మృతి చెందిన ఆవును చూసి ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించాడు. ఫారెస్ట్ అధికారులు ఇంద్రాణి ప్రభాకర్‌లు సంఘటనా స్థలానికి చేరుకుని మృతి చెందిన పాడియావుకు పోస్టు మార్టం నిర్వహించారు. చిరుత సంచారం ఉండడంతో రైతులు అప్రమత్తంగా ఉండాలని వారు సూచించారు.

చెవిరెడ్డికి కానుకగా చేతి గడియారం

విశాలాంధ్ర-తిరుపతి రూరల్: మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని తిరుపతి రూరల్ మండలం గాంధీపురం పంచాయతీకి చెందిన ఎంపీటీసీ జయకర్ చేతి గడియారాన్ని కానుక తీసుకువచ్చి ఇచ్చారు. సాదరంగా చేతికి గడియారం పెట్టుకోవడానికి పెద్దగా ఆసక్తి చూపించని చెవిరెడ్డి తనపై అభిమానంతో చేతి గడియారం తీసుకువచ్చిన ఎంపీటీసీ జయకర్ చేతులు మీదుగానే తన చేతికి గడియారం పెట్టించుకుని సంతృప్తి వ్యక్తం చేశారు.తను కానుకగా ఇచ్చిన చేతి గడియారంను ఆయన రోజంతా ధరించడంతో కానుకగా ఇచ్చిన జయకర్ అంతులేని ఆనందాన్ని వ్యక్తం చేశారు. అంతేకాక చాలా మంది పార్టీ నాయకులు, కార్యకర్తలు రకరకాల స్వీట్లు తీసుకుని రావడంతో ప్రతి ఒక్కరి చేతులు మీదుగా తీసుకున్న చెవిరెడ్డి తింటూ అందరితో సరదాగా గడిపారు.

రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి

వ్యవసాయానికి నాణ్యమైన పురుగు మందులు, విత్తనాలు

విశాలాంధ్ర-తిరుపతి రూరల్: రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అన్నివిధాలా కృషి చేస్తున్నట్లు చంద్రగిరి నియోజకవర్గం ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. శనివారం కమ్మ కండ్రిగ సచివాలయం వద్దకు చేరుకున్న ఎమ్మెల్యేకి ఘన స్వాగతం పలికారు. మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రాయితీతో వేరుశనగ విత్తనాల కాయల పంపిణీ కార్యక్రమంను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంయల్ఏ నాని సభను ఉద్దేశించి మాట్లాడుతూ పెద్దాయన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రైతుల అభ్యున్నతి కోసం ఎన్నో పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. గత పాలకులు రాయితీ విత్తనాలు, ఎరువులు, సూక్ష్మ సేద్య పరికరాలు, వ్యవసాయ యంత్ర పరికరాలు ఇవ్వకుండ మొండి చేయి చూపారని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రస్తుతం ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అన్నీవిధాల రైతులకు సహాయ, సహకారం అందించడానికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. రాయితీ వేరుశెనగ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతులు సమస్యలతో కూడిన అర్జీలను ఎమ్మెల్యేకు అందించగా అధికారులతో మాట్లాడి అప్పటికప్పుడే రైతుల సమస్యలను పరిష్కరించారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

విశాలాంధ్ర-తొట్టంబేడు: తొట్టంబేడు మండలం చిలకావారికండ్రిగలో లో వోల్టేజీ సమస్య తీర్చడానికి విద్యుత్ శాఖ అధికారులు శనివారం ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. చిలకావారికండ్రిగలో చాలా కాలంగా లో వోల్టేజీ సమస్య ఉండటం తో... గ్రామస్థులు ఈ సమస్యను ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమస్యపై సుధీర్ రెడ్డి వెంటనే స్పందించారు. చిలకావారికండ్రిగలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి లో వోల్టేజీ సమస్య తీర్చాలని ఆ శాఖ అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు విద్యుత్ శాఖ ఏఈ బాలాజీ చిలకావారికండ్రిగలో ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు చేసి లో వోల్టేజీ సమస్య తీర్చారు. దీంతో ఆ గ్రామస్తులు ఎమ్మెల్యే బొజ్జల వెంకటసుధీర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శాతవాహన విశ్వవిద్యాలయం వైస్-ఛాన్సలర్
ప్రొఫెసర్ ఉమేష్ కుమార్‌కు సన్మానం

విశాలాంధ్ర-తిరుపతి రూరల్: అఖిల భారతీయ రాష్ట్రీయ సైక్షిక్ మహాసంఘ్ ఆంధ్రప్రదేశ్ శాఖ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ వై.వి. రామిరెడ్డి, మంజులతో కలిసి తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం అతిథి గృహంలో శాతవాహన విశ్వవిద్యాలయం వైస్-ఛాన్సలర్ ప్రొఫెసర్ యు. ఉమేష్ కుమార్‌ను సత్కరించారు. ఈ సందర్భంగా రామిరెడ్డి మాట్లాడుతూ విద్యారంగంలో ఆయన చేసిన విశేష కృషికి ఈ గౌరవం, గుర్తింపు రావడం ఎంతో ఆనంద దాయకమని కొనియాడారు.ఈ కార్యక్రమంలో ఏబీఆర్ఎస్ఎం రాష్ట్ర ట్రెజర్ ప్రొఫెసర్ ఎం.రాజశేఖర్, డా. ఎన్.బాలసుబ్రహ్మణ్యం, డా. వి.మంజునాథ్ పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు: మహమ్మద్ రఫీ

విశాలాంధ్ర-రామకుప్పం: మండల కేంద్రమ్మైన మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని కెంపసముద్రం అయ్యప్ప గానిపల్లి 57వ బూత్ పరిధిలో క్లస్టర్ ఇన్‌చార్జి మహమ్మద్ రఫీ మరియు యూనిట్ ఇన్‌చార్జి వెంకట రమణ ఆధ్వర్యంలో శనివారం సభ్యత్వ నమోదు కార్యక్రమం వేగవంతంగా జరుగుతున్నదని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కుప్పం నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చి దిద్దేందతంతో పాటు అన్ని రంగాల్లో అభివృద్ధి పరిచేందుకు ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేసుకున్నారని తెలిపారు. ఇందుల్లో భాగంగా మండల ప్రజలు తెలుగుదేశం పార్టీలో సభ్యత్వం పొందడానికి మొగ్గు చూపుతున్నారని ఆనందం వ్యక్తం చేశారు. వంద రూపాయలు చెల్లించి సభ్యత్వ నమోదు చేసుకుంటే ఐదులక్షలు ప్రమాద బీమా సౌకర్యం కల్పించడం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సురేష్, శంకరప్ప, మరియు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

తనది కాని భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నం

విశాలాంధ్ర-తిరుపతి రూరల్: తనది కాని భూమిని ఆక్రమించేందుకు చేసిన ప్రయత్నాలను సర్వే అనే ఆయుధంతో రైతులు తిప్పికొట్టిన ఘటన తిరుపతి రూరల్ మండలం పాతకాల్వ పంచాయతీలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే... కల్పన అనే మహిళ తిరుపతి రూరల్ మండలం పేరూరు లెక్కదాఖల సర్వే నెంబర్ 197/1లో 50 సెంట్ల భూమిని కొనుగోలు చేసింది. తను కొనుగోలు చేసిన భూమికి సంబంధించి సరైన దారి లేదు. అందుకే పక్కనే ఉన్న సర్వే నెంబర్ 197/2 లోని భూమికి సంబంధించిన హద్దులను రిజిస్ట్రేషన్ సమయంలో చూపించారు. హద్దులు చూపించారు కాబట్టి సర్వే నెంబర్ 197/2లోని భూమిని ఆక్రమించుకునేందుకు ప్రయత్నించారు. దౌర్జన్యంగా భూమి చుట్టూ ప్రహరీ నిర్మించేందుకు ప్రయత్నించారు. అయితే 197/2 కు సంబంధించిన రైతులు 15 ఏళ్ల క్రితమే లేఅవుట్ వేసి 14 మందికి ప్లాట్ల రూపంలో విక్రయించారు. తమ భూమిలో కల్పన దౌర్జన్యంగా ప్రహరీ నిర్మిస్తుందని, రక్షించాలని కొనుగోలు దారులు, రైతులు వేడుకున్నా పోలీసులు పట్టించుకోలేదు. అమరావతి స్థాయిలో ప్రభుత్వంలోని కొందరు పెద్దలు ఒత్తిళ్లతో పోలీసులు కల్పనకు వత్తాసు పలుకుతున్నారని రైతులు ఆరోపించారు. దానికి తగ్గట్టుగానే కల్పన ఫిర్యాదు చేయడం, రైతులు, కొనుగోలు దారులపై తిరుపతి రూరల్ పోలీసులు కేసులు నమోదు చేయడం వెనువెంటనే జరిగిపోయాయి. సర్వే చేసి ఆమెకు సంబంధించిన భూమి అయితే తీసుకోవాలని, ఆమెకు సంబంధం లేకుండానే రోడ్డు పక్కన ఉందని తమ భూమిని ఆమె ఆక్రమిస్తుందని బాధితులు మొత్తుకున్నా వినలేదు. చివరకు ప్రైవేటు కేసు వేస్తామని బాధితులు చెప్పడంతో పోలీసులు సర్వేకు రెవెన్యూకు రాశారు. సర్వే నెంబర్ 197/1, 197/2 భూమికి సంబంధించిన హద్దులను నిర్ధారించాలని తిరుపతి రూరల్ సీఐ చిన్నగోవిందు రూరల్ తహసీల్దార్‌కు లేఖ రాశారు. దీంతో శుక్రవారం మండల సర్వేయర్ హేమకుమార్, విలేజ్ సర్వేయర్లు, సీఐ చిన్నగోవిందు వివాదంలోని పట్టా భూమిని సర్వే చేశారు. కల్పన నిర్మిస్తున్న ప్రహరీ ఆమెకు సంబంధం లేని సర్వే నెంబర్ 197/2 లో ఉందని, ఆమె భూమి పక్కన ఉందని సర్వేయర్లు నిర్ధారించారు. ఆమేరకు హద్దులను సైతం చూపించారు. న్యాయం గెలిచిందని రైతులు, ప్లాట్ల యాజమానులు ఆనందం వ్యక్తం చేశారు. ఇదిలా ఉంటే 197/2లో తాను నిర్మించుకున్న ఇంటితో పాటు తనపేరుతో ఉన్న విద్యుత్ మీటర్ ను సైతం దొడ్డిదారిలో కల్పన పేరుతో మార్చుకున్నారని పేరూరుకు చెందిన హేమంత్‌ఆచారి ఆవేదన వ్యక్తం చేశారు. లంచాలకు అలవాటు పడి విద్యుత్ మీటర్‌ను కల్పన పేరుతో మార్చిన అధికారులపైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏళ్ల తరబడి రగులుతున్న భూ సమస్యను ఒక్క సర్వేతో నిజం నిర్ధారణ కావడంతో గ్రామస్తులు, రైతులు హర్షం వ్యక్తం చేశారు. తమ భూమిని ఆక్రమించుకోవడానికి ప్రయత్నించడమే కాకుండ, తమపై కేసులు పెట్టి మానసికంగా వేధించిన కల్పనపై చర్యలు తీసుకోవాలని రైతులు యోగానందరెడ్డి, రామచంద్రారెడ్డి డిమాండ్ చేశారు.

వైసిపి నేత వెంకట్ రెడ్డి యాదవ్ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-పుంగనూరు: జిల్లా యాదవ సంక్షేమ సంఘం నాయకులు నియోజవర్గ ప్రజల ఆత్మీయుడు ప్రజల బాంధవుడు ఎందరికో రాజకీయ అవకాశాలు కల్పించిన నేత పట్టణంలో శ్రీకృష్ణ ఆలయ నిర్మాణ దాత మాజీ ఎంపీపీ జడ్పిటిసి జిల్లా పరిషత్ మాజీ ఫ్లోర్ లీడర్ పికెఎం అర్బన్ అథారిటీ ఆది చైర్మెన్ రాష్ట్ర మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అత్యంత సన్నిహితుడు వెంకట్ రెడ్డి యాదవ్ జన్మదిన వేడుకలు తన అభిమానులు తన ఆత్మీయులు స్నేహితులు శనివారం రోజున తన నివాసం నందు కేక్ కట్ చేసి ఆయనకు తినిపించి ఘనంగా శు భాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ముఖ్యంగా ఆయన ప్రధాన అనుచరుడు మండల వైస్ ఎంపీపీ రమణ ఆధ్వర్యంలో భారీ మొత్తంలో బాణ సంచులు పేలుస్తూ అతిపెద్దైన పూలదండతో సత్కరించడం జరిగింది. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు ఆయన రానున్న రోజుల్లో ఆ దేవదేవుని ఆశీస్సులు శ్రీకృష్ణ స్వామి ఆశీస్సులతో మరెన్నో జన్మదిన వేడుకలు జరుపుకోవాలని సామాజికంగా ఆర్థికంగా రాజకీయంగా ఉన్న స్థానంలో నిలవాలని మనసా వాచా కోరుకుంటున్నామన్నారు ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు ఆయన అనుచరులు తదితరులు పాల్గొన్నారు.

సమస్య పరిష్కారం

విశాలాంధ్ర-బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని కారణి మిట్ట గ్రామంలో ఉన్న సమస్యను శనివారం గ్రామ సర్పంచ్ పద్మమ్మ కుమారుడు కార్తీక్ నాయుడు పరిష్కరించారు. గ్రామంలోని దళితవాడలో రెండు త్రాగునీటి బోర్లు పునాది మరమ్మతులకు గురి కావడంతో గత పాలనలో మరమ్మతులు నోచుకోక పోవడంతో దళిత వాసులు సమస్యను సర్పంచ్ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో కార్తీక్ నాయుడు స్పందించి రెండు బోర్లకు ఫ్లాట్ ఫామ్ ఏర్పాటు చేసి ప్రజలకు సౌకర్యార్థంగా చర్యలు చేపట్టారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

విశాలాంధ్ర-గూడూరు: గూడూరు పట్టణం లోని వృద్ధాశ్రమంలో ఆశ్రయం పొందుతూ అనారోగ్యంతో మృతిచెందిన ఓ వృద్ధుడికి అంత్యక్రియలు జరిపించేందుకు అయినవాళ్లు ఎవరూ లేకపోవడంతో ఆశ్రమ నిర్వాహకుల ద్వారా సమాచారం తెలుసుకున్న జనసైనికులు, మెగాబ్రదర్స్ సేవా సమితి సభ్యులు ఆ వృద్ధుడికి సొంత ఖర్చులతో అంత్యక్రియలు జరిపించి మానవత్వం చాటుకున్నారు. గూడూరు పట్టణంలోని ఓం శ్రీ సాయిరాం చారిటీస్ వృద్ధాశ్రమంలో కృష్ణయ్య (85) అనే వృద్ధుడు ఆశ్రయం పొందుతున్నాడు. ఈ క్రమంలో కృష్ణయ్య అనారోగ్యానికి గురై శనివారం ఉదయం మృతి చెందినట్లు ఆశ్రమ నిర్వాహకురాలు కళ్యాణి తెలిపారు. అంత్యక్రియలు జరిపేందుకు మృతునికి సంబంధించిన వారు ఎవరూ లేకపోవడంతో వృద్ధాశ్రమం నిర్వాహకురాలు కళ్యాణి మెగాబ్రదర్స్ సేవా సమితి నిర్వాహకులు, ఉమ్మడి నెల్లూరు జిల్లా జనసేన పార్టీ ఉపాధ్యక్షులు తీగల చంద్రశేఖర్ రావుకు విషయాన్ని తెలిపారు. దీంతో మెగాబ్రదర్స్ సేవాసమితి సభ్యులు ఓంకార్, మోహన్, వెంకటేష్, మధుసూదన్, సాయికిరణ్ వృద్ధాశ్రమానికి చేరుకొని కృష్ణయ్య మృతదేహాన్ని హిందూ సాంప్రదాయం ప్రకారం గూడూరు సాదుపేట సెంటర్‌లో ఉన్న హిందూ స్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.

అన్ని సర్వే కార్యక్రమాలను సమన్వయంతో పూర్తి చేయాలి

విశాలాంధ్ర-పెద్దపంజాణి: క్షేత్రస్థాయిలో రాజు పల్లి సచివాలయ పరిధిలో జరుగు తున్న సర్వే కార్యక్రమాలను ఎంపీడీవో బాలాజీ శనివారం పర్యవేక్షించారు. పంచాయతీ కార్యదర్శి సచివాలయ సిబ్బంది క్షేత్రస్థాయిలో తప్పనిసరిగా ఈ సర్వే కార్యక్రమాలన్నిటిని పూర్తి చేయాలని ఆయన సూచించారు. యూడిఐడి కార్డులు లేని ప్రత్యేక ప్రతిభావంతులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ప్రతి ఇంటికి హౌస్ హోల్డ్ జియో ట్యాగింగ్ తప్పనిసరి ఉండాలన్నారు. అన్ని బ్యాంకు అకౌంట్లకు ఎన్పీసీఐ ద్వారా ఆధార్ అనుసంధానం చేసుకోవాలని తెలిపారు. పెద్ద వెలగటూరు, రాజు పల్లి సచివాలయాల పరిధిలో జరుగుతున్న సర్వే కార్యక్రమాలను ఎంపీడీవో పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు సచివాలయ సిబ్బంది ఈ సర్వే కార్యక్రమాలలో పాల్గొంటున్నారని ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారం ఆధార్ కార్డులు, జనన ధ్రువీకరణ పత్రాలు లేని ఎస్టీల కోసం ప్రత్యేక సర్వే కార్యక్రమం జరుగుతోందని ఆధార్ కార్డులు, జనన ధ్రువీకరణ పత్రాలు లేని గిరిజనులు తక్షణమే వారి వివరాలను సెల్ఫ్ డిక్లరేషన్ ఫారాలను పంచాయతీ కార్యదర్శి వీఆర్వోలకు అందజేయాలని ఎంపీడీవో సూచించారు.

కూటమి ప్రభుత్వ హయాంలోనే క్రీడాభివృద్ధికి తోడ్పాటు

యాదమరిలో రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీలను ప్రారంభించిన పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్

విశాలాంధ్ర-చిత్తూరు: కూటమి ప్రభుత్వం క్రీడాభివృద్ధికి చేయూతనిస్తున్నట్లు పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ తెలిపారు. శనివారంపూతలపట్టు నియోజకవర్గం, యాదమరి జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో 68వ రాష్ట్ర స్థాయి అండర్-17 కుస్తీ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి క్రీడాభివృద్ధికి అవసరమైన అన్ని సహాయ సహకారాలు అందించడం జరుగుతుందని, క్రీడాకారుల పట్ల భాధ్యతతో వారిని ప్రోత్సహిస్తాం దని గుర్తు చేశారు. యాదమరి మండలానికి ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్న అధికారులను, నాయకులను ఆయన అభినందించారు. విద్యార్థులకు క్రీడలు చాలా అవసరమని, యాదమరి మండలంలో జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకునే క్రీడాకారులు ఉన్నారని నాకు తెలిసిన వెంటనే యాదమరిలో క్రీడా పోటీలు నిర్వహించేందుకు అవకాశం లేక పోయినా నేను చొరవ చూపి రెజ్లింగ్ పోటీలు నిర్వహించడం జరిగిందన్నారు. రాష్ట్ర స్థాయిలో క్రీడా పోటీలు జరిగితే మరి కొంతమంది క్రీడాకారులు తయారు అయ్యే అవకాశం ఉందన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వంతో పాటుగా ఎమ్మెల్యేగా నేను ఎప్పుడూ ముందుంటానన్నారు. జీవితంలో గెలుపు సాధించేందుకు క్రీడలు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో యాదమరి మండల అధ్యక్షులు మురార్జీ యాదవ్, నాయకులు అమరనాథ్ నాయుడు, చిత్రా నాయుడు, చిట్టిబాబు నాయుడు మండల నాయకులు, కార్యకర్తలు, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళికల శిక్షణ

విశాలాంధ్ర-పెద్దపంజాణి: మంగళ బుధవారాల్లో పెద్ద పంజాణి మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళికల గురించి శిక్షణా కార్యక్రమం ఉంటుందని ఎంపీడీవో బాలాజీ, పంచాయతీ విస్తరణ అధికారి శారదాదేవి తెలిపారు. రెండు బ్యాచులకు ఒక్కో రోజు చొప్పున శిక్షణ పొందిన టీఓటీలచేత ఈ శిక్షణా కార్యక్రమం ఉంటుందని వారు తెలిపారు.గౌరవ ఎంపీపీ, గౌరవ జడ్పిటిసి సభ్యులు, గౌరవ పంచాయతీ సర్పంచ్ లకు, గౌరవ ఎంపిటీసీ సభ్యులకు ,పంచాయతీ కార్యదర్శులకు, డిజిటల్ అసిస్టెంట్లకు, మండల స్థాయి అధికారులకు గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళికల తయారీ గురించి ఒకరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు, అందరు ప్రజా ప్రతినిధులు మండల అధికారులు సిబ్బంది ఈ శిక్షణా కార్యక్రమానికి తప్పక హాజరు కావలసిందిగా వారు తెలిపారు.

ఓటర్ల జాబితాలో సవరణలు చేసుకోండి

విశాలాంధ్ర-చౌడేపల్లి: ఓటర్ల జాబితా లో సవరణలు ఉంటే సరిచూసుకో వాలని తహసిల్దార్ హనుమంతు నాయక్ అన్నారు. శనివారం ఈ మేరకు ఆయన మండలంలోని పలు పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఓటర్ జాబితా సవరణ కేంద్రా లను పరిశీలించారు. చిరునామా, పేర్లు, నూతనంగా పేర్లను నమోదు చేయించుకునే కార్యక్రమాన్ని ఈనెల 10 వరకు చేపట్టనున్నట్లు ఆయన వివరించారు. ఈ అవకాశాన్ని అర్హులైన వారందరూ వినియోగించుకోవాలని కోరారు. విజయ్ కుమార్ రెడ్డి మండలం లోని పోలింగ్ కేంద్రాల పరిధిలో వీఆర్వోలు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కుల ప్రాతిపదికన నామినేటెడ్ పదవులు ఇవ్వడం హర్షదాయకం

విశాలాంధ్ర-బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని తెలుగుదేశం పార్టీ తిరుపతి పార్లమెంటు రైతు కార్యదర్శి భాస్కర్ యాదవ్, టిడిపి సత్తిగాడు నియోజకవర్గ నాయి బ్రాహ్మణ అధ్యక్షుడు ఏడాం వెంకటాచలం శనివారం హర్షం వ్యక్తం చేశారు. నియోజకవర్గ నాయి బ్రాహ్మణ అధ్యక్షుడు వెంకటాచలం మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నాయి బ్రాహ్మణులను గుర్తించి ఏ పార్టీ ఇవ్వనంత గుర్తింపు తెలుగుదేశం పార్టీ తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు మెంబర్ వైద్య శాంతారావుకు మరియు నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ సదాశివంకు ఇవ్వడం హర్షదాయకమన్నారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ముఖ్యమంత్రి నామినేటెడ్ పదవులు కుల ప్రాతిపదికన అందించడంలో సమన్యాయంగా వ్యవహరించిన తీరు హర్షదాయకమన్నారు. బీసీలకు ఇచ్చిన గౌరవం చాలా సంతోషదాయకమని కొనియాడారు.

బోయకొండ గంగమ్మ సేవలో టీటీడీ పాలక మండలి సభ్యుడు

విశాలాంధ్ర-చౌడేపల్లి: చౌడేపల్లి మండలము, దిగువపల్లి గ్రామములో ప్రముఖ శక్తి క్షేత్రంగా విరాజిల్లుతున్న, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ బోయకొండ గంగమ్మ దేవస్థానమునకు శనివారం గురజాల, గుంటూరు జిల్లా ఎమ్మెల్సీ తిరుమల తిరుపతి దేవస్థానము ధర్మకర్తల మండలి సభ్యులు జంగా క్రిష్ణ మూర్తి, పుంగనూరు మాజీ శాసన సభ్యులు బగ్గిడి గోపాల్ పలమనేరు సబ్ జడ్జి రాధమ్మ అమ్మవారి దర్శనార్థము విచ్చేసినారు. వీరికి దేవస్థాన ఉప కమిషనరు కార్యనిర్వహణాధికారి ఏకాంబరం అమ్మవారి దర్శన భాగ్యము కలుగజేసి వీరికి తీర్థ ప్రసాదములు అందజేశారు. ఈ కార్యక్రమములో దేవస్థాన అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

పరమశివుని దర్శించుకున్న వాసు

విశాలాంధ్ర-చౌడేపల్లి: చౌడేపల్లిలో గల మృత్యుం జయశ్వర స్వామిని రాష్ట్ర వాసవి అన్నపూర్ణ నిత్య అన్నదాన సత్రాల అధ్యక్షుడు బనవాసి వాసు దర్శించు కున్నారు. ఆయనకు మేళతాళాలతో స్వాగతం పలికి స్వామి వారి దర్శన భాగ్యం కల్పించారు. ఆలయ ప్రధాన అర్చకుడు రాజశేఖర్ దీక్షితులు ఆధ్వర్యంలో వేద ఆశీర్వాదం పవిత్ర తీర్థప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో సత్రాల కార్యదర్శి లక్ష్మయ్య స్థానికులు నూజిల్లా నాగరాజా చెనరాజశెట్టి రంగబాబు మునరాజ శెట్టి ప్రభాకర్ శెట్టి తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప భజనలతో మార్మోగిన పెరుమాల కండిగ

విశాలాంధ్ర-పెనుమూరు: మండలంలోని పెరుమాల కండిగ గ్రామంలో అయ్యప్ప స్వామి భజనలతో శు క్రవారం రాత్రి మార్మోగిందని గ్రామస్తులు తెలిపారు. ఈ సందర్భంగా పెరుమాల కండిగ గ్రామంలో ఈదల వెంకటాచలం నాయుడు వారి కుటుంబ సభ్యులు శివ, తేజస, గ్రామంలో అయ్యప్ప స్వామి పుష్పాలతో భజన మందిరాల ఏర్పాటు చేసి గ్రామంలో ఎప్పుడు జరగనంత వేడుకగా అయ్యప్ప స్వామి భజనలు చేశారని తెలిపారు. ఈ పూజలకు గ్రామములోని మహిళలు పెద్దలు మరియు చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చినటువంటి అయ్యప్ప స్వాములు సుమారు 150 మంది పూజల్లో పాల్గొని ఘనంగా నిర్వహించడం జరిగిందన్నారు. అనంతరం తీర్థప్రసాదాలను అందజేయడం భోజన సదుపాయాలను కలుగజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడానికి హరిహర పురం అయ్యప్ప స్వామి దేవాలయం ఆలయ ధర్మకర్త రవీంద్ర గురుస్వామి మరియు ఆయన శిష్య బృందం పాల్గొని పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించామన్నారు.

ఓటరు నమోదు కేంద్రాలను పరిశీలించిన కమిషనర్

విశాలాంధ్ర-పుత్తూరు: పుత్తూరు పురపాలిక పరిధిలోని అన్నీ పోలింగ్ కేంద్రాల్లో కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు స్పెషల్ సమ్మరి రివిజన్ అఫ్ డేట్ కోసం ఈ నెల 9, 10, 23, 24 తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఓటర్ నమోదు, సవరణ చేయడానికి బూత్ లెవల్ అధికారులు ఆయా పోలింగ్ కేంద్రాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటారని మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్ తెలిపారు. అందులో భాగంగా శనివారం పట్టణంలోని కొత్తగా ఓటు హక్కు కోసం నమోదు చేసుకోవడాన్ని, ఓటర్లు తొలిగింపు, సవరణ కోసం అర్జీలు స్వీకరించే కార్యక్రమను అన్నీ పోలింగ్ కేంద్రాలను కమిషనర్ తనిఖీ చేశారు. బూత్ లెవల్ అధికారులకు కమిషనర్ పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

ఎమ్మెల్యే థామస్‌కు ఘన స్వాగతం

విశాలాంధ్ర-కార్వేటినగరం: ఎమ్మెల్యే డాక్టర్ విఎం థామస్కు తెలుగు తమ్ముళ్లు జి.మహేష్, తిరుమలయ్య బాబు రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా బాణ సంచాల పేల్చి ఘన స్వాగతం పలికారు. అనంతరం చెంగల్రాయల్ యాదవ్, బిగల రమేష్, మహేష్ శాలువలు కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మోహన్ గణేష్ అల్లిముత్తు కిరణ్ సుబ్రహ్మణ్యం నాగేశ్వర రాజు, రాజేందర్ రెడ్డి రమేష్ రెడ్డి ఢిల్లీ బాబు రెడ్డి, చెంగల రాయులు, తదితరులు పాల్గొన్నారు.

ఏపీ సీడ్స్ మాజీ డైరెక్టర్ దందోలు భక్తవత్సల రెడ్డికి బొజ్జల బృందమ్మ నివాళి

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: అనారోగ్యంతో మృతి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ఏపీ సీడ్స్ మాజీ డైరెక్టర్ దందోలు భక్తవత్సల రెడ్డి భౌతికకాయానికి బొజ్జల బృందమ్మ పూలమాల వేసి నివాళులర్పించారు. శ్రీకాళహస్తి మండలం, తొండమానిపురం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ఏపీ సీడ్స్ మాజీ డైరెక్టర్ దందోలు భక్తవత్సల రెడ్డి అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి మాతృమూర్తి బొజ్జల బృందమ్మ, సతీమణి బొజ్జల రిషితా రెడ్డిలు తొండమానిపురం గ్రామానికి వెళ్లి దందోలు భక్తవత్సల రెడ్డి భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను ఓదార్చి అండగా ఉంటామని తెలిపి. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసి, తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని కుటుంబ సభ్యులకు ఓదార్చారు. వీరితోపాటు టిడిపి నాయకులు పలువురు పార్థివ దేహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు.

13న జిపిడిపి శిక్షణ తరగతులు

విశాలాంధ్ర-ఓజిలి: మండల కేంద్రమైన మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 13వ తేదీన జిపిడిపి శిక్షణ తరగతులు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 6.30 గంటల వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీవో విజయలక్ష్మి ఒక ప్రకటనలో తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ అరుణమ్మ, జడ్పిటిసి రవీంద్ర రాజు ఎంపిటిసీలు సర్పంచులు పంచాయతి కార్యదర్శులు తదితరులు పాల్గొంటారని ఆమె తెలియజేశారు.

నూతన డ్యాం నిర్మాణం వద్దంటూ ఎమ్మెల్యేకు వినతి

- ఇరిగేషన్ అధికారులతో చర్చించిన ఎమ్మెల్యే, చిట్టిబాబు నాయుడు

- గత వైసీపీ ప్రభుత్వంలో రూ.90 కోట్లు నిధులు మంజూరు

విశాలాంధ్ర-కార్వేటినగరం: ముక్కరవాణి పల్లె వద్ద నూతనంగా ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో డ్యాం నిర్మాణం చేపట్టకూడదంటూ ఏడు గ్రామాల రైతులు ఎమ్మెల్యే డాక్టర్ థామస్కు వినతి అందించారు. శనివారం మండలంలోని ముక్కరవాని పల్లె వద్ద వైసీపీ ప్రభుత్వ ఆయాయంలో 90 కోట్ల రూపాయలు మంజూరు అయిందని ఇరిగేషన్ శాఖ అధికారులు ఎమ్మెల్యేకు వివరించారు. నూతన డ్యాం నిర్మిస్తే దాసరనెత్తం గ్రామం పూర్తిగా మునిగిపోతుందని, అదేవిధంగా ముక్కరవాణి పల్లె, కత్తెర పల్లె, కత్తెరపల్లె దళితవాడ,గంగ మాంబాపురం, రాచాపాల్యం పొన్నగల్, కొత్తూరు, ఆలత్తూరు గ్రామ రైతులు నష్టపోతారని రైతులు తిరుమలయ్య, సర్పంచ్ గుణవతి లోకనాథం నాయుడు, ముని రామశెట్టి, పరందం, కృష్ణమ్మ నాయుడు, నీల వర్మ నాయుడు లు ఎమ్మెల్యే థామస్కు వివరించారు. డాం నిర్మిస్తే దాహం అంతా పూర్తిగా నష్టపోతామని పేర్కొన్నారు. గతంలో మీరు కూడా దాసరి నెత్తం గ్రామంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వస్తే డ్యాం నిర్మాణాన్ని రద్దు చేస్తామని మాకు హామీ ఇచ్చారని గుర్తు చేశారు.రైతులకు ప్రభుత్వం మేలు చేసే విధంగా చూస్తానని ఎమ్మెల్యే రైతులకు హామీ ఇచ్చారు. కృష్ణాపురం డ్యాం ఉన్నందువల్ల రైతులకు నీళ్లు పుష్కలంగా ఉందని రైతులు వివరించారు.నూతన డ్యామ్ నిర్మాణానికి ఏటి కాలువల వద్ద ఎమ్మెల్యే, ఇరిగేషన్ అధికారులు పరిశీలించారు. ఎమ్మెల్యే జిల్లా ఇరిగేషన్ అధికారులతో చర్చించి రైతులకు న్యాయం జరిగేలా చూస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి కార్యదర్శి చిట్టిబాబు నాయుడు, మండల పార్టీ అధ్యక్షులు చెంగల్రాయల యాదవ్, జిల్లా రైతు సంఘం అధ్యక్షులు నాగేశ్వర రాజు,తెలుగు యువత కార్యదర్శి బిగల రమేష్ , జి మహేష్ తిరుమలయ్య ప్రసాద్ మోహన్ గణేష్ కిరణ్ సుబ్రహ్మణ్యం అల్లిముత్తు చంద్రమోహన్ రెడ్డి, రాజేంద్ర రెడ్డి అన్నా రెడ్డి రమేష్ రెడ్డి ఢిల్లీ బాబు రెడ్డి చంద్రమౌళి రెడ్డి జనార్దన్ రాజు ప్రకాష్ రాజు హేమంత్ రెడ్డి, సోమశేఖర్ యాదవ్ ఇరిగేషన్ ఎస్. సి విజయ్ కుమార్ రెడ్డి,ఇ ఇ వెంకటేశ్వర్ ప్రసాద్, డి.ఇ.మురళి కుమార్, ఏఈలు రవిప్రకాష్, నాయక్ తదితరులు పాల్గొన్నారు.

టిడిపి మహిళా నేత కుమారికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన బొజ్జల బృందమ్మ, రిషితా రెడ్డి

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: టిడిపి పట్టణ మహిళ కార్య నిర్వాహక కార్యదర్శి కుమారి జన్మదిన సందర్భంగా శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి మాతృమూర్తి బొజ్జల బృందమ్మ, సతీమణి బొజ్జల రిషిత రెడ్డి మహిళలు కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. కుమారి తెలుగుదేశం పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తు క్రమశిక్షణ కలిగిన మహిళ నేతగా గుర్తింపు తెచ్చుకున్నారు. వైసిపి ప్రభుత్వం హయంలో మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలపై పార్టీ పిలుపుమేరకు అన్ని కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని మహిళలకు అండగా నిలిచారు. కుమారి జన్మదినం సందర్భంగా టిడిపి నాయకులు కార్యకర్తలు ఆమెకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి జ్ఞాన ప్రసూనామ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామి అమ్మవార్ల ఆశీస్సులతో నిండు నూరేళ్ళు ఆయురారోగ్యాలతో జీవించి మరెన్నో జన్మదిన వేడుకలను జరుపుకోవాలని ఆకాంక్షించారు.

విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన శిక్షలు

విశాలాంధ్ర-పుత్తూరు: విద్యార్థులు ర్యాగింగ్ కు పాల్పడితే కఠిన శిక్షలు తప్పవని స్థానిక సీనియర్ సివిల్ జడ్జి ఎన్.సి.రాఘవేంద్ర తెలిపారు. శనివారం న్యాయ సేవా దినోత్సవాన్ని పరిష్కరించుకొని పట్టణంలోని ఓ ప్రైవేటు కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ కళాశాల యాజమాన్యాలు ర్యాగింగ్ నివారణకు తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. ర్యాగింగ్ కు పాల్పడిన వారిని కళాశాల నుంచి డిస్మిస్ చేయాలని సూచించారు. మాధక ద్రవ్యాల వాడకం నేర ప్రవృతిని పేరు ప్రేరేపిస్తుందని తెలిపారు. మత్తు పదార్థాలకు బానిసైతే విలువైన జీవితం నాశనం అవుతుందని మాదక ద్రవ్యాలు నిర్మూలన అందరి బాధ్యతని ఇందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. అలాగే లైంగిక వేధింపులను నిర్మించాలని పని చేసే చోట స్త్రీలను గౌరవించాలని సూచించారు. మానవ అక్రమ రవాణా నిరోధానికి ప్రజలు తమ వంతు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని వాటిని అధిరోహించాలని సూచించారు. న్యాయ సేవాధికార సంస్థ ద్వారా పేదలకు ఉచిత న్యాయ సేవలు అందిస్తున్నామని వీటిని ప్రజలు ప్రతినిధులు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో యువకుడు ఆత్మహత్యాయత్నం

విశాలాంధ్ర-పుంగనూరు: చిత్తూరు జిల్లా పుంగనూరు మండల సమీపంలో గల పెద్దపంజాణి మండలం గద్దురు గ్రామానికి చెందిన నాగరాజ కుమారుడు వెంకటరమణ (29) కుటుంబ కలహాలతో పిడదుల నివారణ మందు తాగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. వెంటనే గమనించిన కుటుంబ సభ్యులు వెంకటరమణను పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నాణ్యమైన పౌష్టికాహారం అందివ్వాలి

బొజ్జల బృందమ్మ

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందివ్వాలని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి మాతృమూర్తి బొజ్జల బృందమ్మ సూచించారు. శ్రీకాళహస్తి పట్టణం తెలుగు గంగ కాలనీ వద్ద గల గురుకుల పాఠశాల హాస్టల్‌ను ఆమె బొజ్జల రిషితారెడ్డితో కలిసి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం వారు పిల్లలకు వడ్డించే ఆహార పదార్థాలను పరిశీలించి నాణ్యతను మరింత పెంచాలని తెలిపారు. లేనియెడల కాంట్రాక్టర్‌ను తక్షణమే మార్చాలని ఆదేశాలు ఇచ్చారు. విద్యార్థులకు అందించే ఆహారంలో ఎటువంటి రాజీపడవద్దని, నాణ్యమైన ఆహారం అందివ్వాలని అధికారులకు సూచించారు. నాణ్యమైన ఆహారం అందివ్వకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం టాయిలెట్లను పరిశీలించి నీటి వసతిపై ఆరా తీశారు. బొజ్జల బృందమ్మ వెంట టిడిపి నాయకులు బత్తి రెడ్డి, గోపీనాథ్, మల్లీశ్వరమ్మ, కుమారి, బాలాజీ రెడ్డి, ప్రవీణ్, తదితరులు ఉన్నారు.

తాగిన మత్తులో కత్తితో కోసుకున్న వ్యక్తి

విశాలాంధ్ర-పుంగనూరు: చిత్తూరు జిల్లా రామ సముద్రం మండలం ఊలపాడు గ్రామానికి చెందిన వెంకటరమణ కుమారుడు అమర్నాథ్ (35) తాగిన మైకంలో కత్తితో రెండు చేతులను కోసుకున్నాడు. వెంటనే గమనించిన కుటుంబ సభ్యులు అమర్నాథ్‌ను పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటన శనివారం మధ్యాహ్నం వెలుగులోకి వచ్చింది. పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తు తెలియాల్సి ఉంది.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

విశాలాంధ్ర-రామకుప్పం: మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని పలు గ్రామాలలోని వ్యాపారస్తులు దుకాణ దారులు విధిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్ఐ వెంకటమోహన్ పేర్కొన్నారు. శనివారం పోలీసు స్టేషన్ ఆవరణలో దుకాణ యజమానులు మరియు వ్యాపారస్తులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ దుకాణాల పరిధిలో సీ సీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం వల్ల మోసాలకు పాల్పడే కేటుగాళ్లను సులభంగా గుర్తించి పట్టుకునేందుకు అవకాశాలు ఉన్నాయని, ఒకవేళ ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులుగా అనుమానం వచ్చిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. అదేవిధంగా రోడ్డుకు అడ్డంగా వాహనాలను నిలపకుండా చర్యలు తీసుకోవాలని రోడ్డు ఇరుకుగా ఉండడంతో దుకాణాల యజమానులు రోడ్డుకు అడ్డంగా వాహనాలను నిలపకుడా చూసుకోవాలని దుకాణాలకు సూచించారు. కార్యక్రమంలో బద్రీనాథ్, దయాకర్, ఖదీర్ అహ్మద్, బీఎస్ హరి, యాసీన్, నియాజ్, గోవింద, అబ్దుల్ ఘనీ, మరియు దుకాణదారులు వ్యాపారస్తులు పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో నిందితులు అరెస్టు

విశాలాంధ్ర-తొట్టంబేడు: హత్యాయత్నం కేసులో నలుగురు నిందితులను అరెస్టు చేసినట్లు శ్రీకాళహస్తి రెండవ పట్టణ సీఐ వెంకటేశులు శనివారం తెలిపారు. ఆయన కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. తొట్టంబేడు తహసీల్దారు కార్యాలయ సమీపం లో రెండు రోజుల కిందట విష్ణువర్ధన్ అనే విద్యార్థిపై కయ్యూరి జగన్, వాసుదేవ, మునిరాజా, కూలి భరత్ కుమార్ అనే విద్యార్థులు కత్తితో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డారన్నారు. విష్ణువర్ధన్ ఫిర్యాదు మేరకు నిందితులపై కేసు నమోదు చేశామన్నారు. ఈ నిందితులు శ్రీకాళహస్తి పట్టణంలోని గోపాలవనం బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద ఉండగా అరెస్టు చేశామన్నారు. వీరిని న్యాయస్థానంలో హాజరు పరచగా రిమాండుకు ఆదేశించారని సీఐ వెంకటేశులు తెలిపారు.

శివాలయాల్లో కోటి సోమవారాలు పూజలు

విశాలాంధ్ర-సూళ్లూరుపేట: కార్తీక మాసంలో వచ్చే గొప్ప పర్వదినముగా భావించే కోటి సోమవారం పండుగను శనివారం ఘనంగా జరుపుకున్నారు. మహిళలు పెద్ద సంఖ్యలో శివాలయాలకు చేరుకొని స్వామి వారి ఎదుట దీపాలు పెట్టి పూజలు చేశారు. సూళ్లూరుపేటలో వెలసి ఉన్న శ్రీ గంగా పార్వతి సమేత త్రినేత్ర సంభూతుడైన శ్రీ నాగేశ్వర స్వామి ఆలయంలో కూడా పరమశివునికి కోటి సోమవారాలు పండుగను పురస్కరించుకొని ప్రత్యేక అభిషేకాలు చేసి హారతులిచ్చారు. పెద్ద సంఖ్యలో మహిళలు స్వామి వారి ఎదుట దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకొని పూజలు చేశారు. ఆలయ మాజీ చైర్మన్ చెన్నారెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డి సహాయ సహకారాలతో ఆలయ ప్రధాన అర్చకులు సునీల్ కుమార్ శర్మ నేతృత్వంలో పూజలు జరిపించారు.

జిల్లాలో ఇద్దరికి నామినేటెడ్ పదవులు

విశాలాంధ్ర-చిత్తూరు: జిల్లాలో రెండో విడతల ఇద్దరికి నామినేటెడ్ పదవులు వరించాయి. చిత్తూరు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులుగా ఉన్న సి ఆర్ రాజన్ కు ఏపీ వన్యకుల క్షత్రియ కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ అధ్యక్షుల పదవి దక్కగా, చిత్తూరు మాజీ మేయర్ కటారి హేమలతకు చిత్తూరు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (చూడ) చైర్మన్ పదవి వరించింది. గత శాసనసభ ఎన్నికల్లో వీరు ఇరువురు చిత్తూర్ అసెంబ్లీ టికెట్ను ఆశించారు. అయితే చివరకు చిత్తూరు అసెంబ్లీ టిడిపి అభ్యర్థిగా గురజాల జగన్మోహన్ ను పార్టీ అధినేత ప్రకటించింది. నేపథ్యంలో వీరికి నామినేటెడ్ పదవులు ఇస్తామని పార్టీ అధిష్టానం హామీ ఇచ్చింది. దీంతో రెండో విడతలో వీరికి పదవులు దక్కాయి. ఈ సందర్భంగా కటారి హేమలత విలేకరులతో మాట్లాడుతూ పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు తమ కుటుంబానికి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తూ వస్తున్నారని. చూడా చైర్మన్ పదవి ఇచ్చినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్ లకు ధన్యవాదాలు తెలుపుతున్నట్లు తెలిపారు.

ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ

విశాలాంధ్ర-నాయుడుపేట: నాయుడుపేట మండల పరిధిలో పుదురు గ్రామం నందు శనివారం నవజీవన్ ఆర్గనైజేషన్ సభ్యుల ఆధ్వర్యం లో ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో పాల్గొన్న 70 మందిలో 25 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు అందజేశారు. పట్టణంలోని శ్రీపెసల గుర్రప్పశెట్టి ప్రభుత్వ జూనియర్ కాలేజ్ నందు విద్యార్థులకు ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కల్పించడానికి,సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమములో నవజీవన్ ఆర్గనైజేషన్ ప్రాజెక్ట్ మేనేజర్ బాలాజి మాట్లాడుతూ, ఎయిడ్స్ వ్యాప్తి కారకాలు, ఎలావ్యాపించుదు, హెచ్.ఐ.వి. లక్షణాలు, అవి రాకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల వివక్షత చిన్నచూపు లేకుండా ఎలాగా సమాజములో కలిసి జీవించాలి, మొదలగు విషయాలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ హనుమంతరావు, లెక్చరర్ ఈశ్వరయ్య,సునీత, నవజీవన్ సంస్థకు చెందిన కవిత, శ్రావణి, ఎఎన్ఎం పాల్గొన్నారు.

ఎన్టీఆర్ జలాశయాన్ని సందర్శించిన నీటిపారుదల శాఖ అధికారులు

విశాలాంధ్ర-పెనుమూరు: మండలంలోని కలవకుంట వద్ద ఉన్నటువంటి ఎన్టీఆర్ జలాశయాన్ని నీటిపారుదల శాఖ అధికారులు సందర్శించారు. ఈ సందర్భంగా నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజనీర్ శ్రీనివాసులు మాట్లాడుతూ గత ప్రభుత్వము 25 శాతం కన్నా తక్కువగా ఉన్నటువంటి పనులను రద్దు చేయడం జరిగిందన్నారు. వాటిని పరిశీలించి ప్రస్తుతం ఉన్నటువంటి తెలుగుదేశం ప్రభుత్వం పనులను పర్యవేక్షించి ప్రభుత్వానికి నివేదిక పంపాలని తెలిపారు. ప్రభుత్వము తీసుకున్నటువంటి నిర్ణయాల మేరకు గతంలో ఉన్నటువంటి గుత్తేదారులకు ఇవ్వాలా వద్ద అనేది ప్రభుత్వం నిర్ణయిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ విజయ్ కుమార్ హెగ్డే. సి.మురళి కుమార్, డిఈ జె చంద్రబాబు, ఏ ఈ భరత్. మరియు రాజకీయ నాయకుల, జేడి నెల్లూరు ఎమ్మెల్యే వి.ఎం థామస, మాజీ ఎంపీపీ హరిబాబు నాయుడు, మాజీ జడ్పిటిసి రుద్రయ్య నాయుడు, అధికారులు నాయకులు, కార్యకర్తలు విరివిగా పాల్గొన్నారు.

బంగారు తిరుచ్చి వాహనంపై భక్తులకు దర్శనమిచ్చిన కళ్యాణ వెంకన్న

విశాలాంధ్ర-చంద్రగిరి: శనివారము శ్రీనివాసమంగాపురంలోని శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామివారి ఆలయంలో లక్ష్మి భూదేవి సమేత స్వామి వారు బంగారు తిరుచ్చిపై ఆలయ మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. టెంపుల్ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఎక్జిక్యూటివ్ ఆఫీసర్ పి.వరలక్ష్మి, ఏఈఓ యమ్.గోపీనాథ్, సూపరింటెండెంట్ వల్లంశెట్టి రమేష్ బాబు, టెంపుల్ ఇనస్పెక్టర్ కిరణ్ కుమార్, ఆర్జితం ఇన్స్పెక్టర్ ఆనంబట్టు దనశేఖర్, అర్చకులు అద్దేపల్లి యోగానంద లక్ష్మి నరసింహ శ్రీనివాసా చార్యులు స్వామీ, గోపాల భట్టాచార్య సంతాన కృష్ణన్ స్వామీ అధ్యాపక, డాక్టర్ ఇల్లందు లక్ష్మి రాజేష్ స్వామీ పరిచారిక, నాల్లూరి విష్ణుమూర్తి స్వామీ పరిచారిక, టెంపుల్ సెక్యూరిటీ జలంధర్, భక్తులు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

పెరిగిన విద్యుత్ ట్రూ ఆఫ్ చార్జీలు ప్రభుత్వమే భరించాలి

విశాలాంధ్ర-చిత్తూరు: పెరిగిన ట్రూ ఆఫ్ చార్జీలు రూ.6072 కోట్లను రాష్ట్ర ప్రభుత్వమే భరించాల ని పలు ప్రజా సంఘ నేతలు డిమాండ్ చేశారు. శనివారం చిత్తూరు నగరంలోని పెన్షనర్స్ హోమ్‌లో పలు ప్రజా సంఘ నేతల ఆధ్వర్యంలో సదస్సు జరిగింది. ఈ సందర్భంగా వివిధ ప్రజా సంఘాల నేతలు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచాబో మని ప్రకటించి ఇపుడేమో అధికారం లోకి వచ్చిన 5 నెలలకే రాష్ట్ర ప్రభుత్వం ట్రూ అప్ ఛార్జీ ల పేరుతో రూ. 6072 కోట్లకు పైగా విద్యుత్ భారాన్ని ప్రజలపై భారాన్ని మోపే ప్రయత్నం చేస్తుందని ఈ ఛార్జీలు వల్ల పేద ప్రజలు ఆర్థికంగా ఇబ్బంది పడతారని, నిత్యవసర వస్తువుల ధరలు పెరుగుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వమే ఈ చార్జీలను భరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు చైతన్య, సురేంద్ర, శ్రీనివాస్ మూర్తి, ద్వారకనాథ్, చక్రవర్తి రెడ్డి, నౌషాద్ మునుస్వామి తదితరులు పాల్గొన్నారు.

దాత పొన్నురంగం సేవలు మరువ లేనివి

విశాలాంధ్ర-కార్వేటినగరం: విశ్రాంత ఉపాధ్యాయుడు పొన్నురంగం సేవలు మరువ లేనిదని మండల విద్యాశాఖ అధికారి ఎం.విజయకుమార్ అన్నారు. ఎమ్మార్పీ భవనం ముందు దాత పొన్నురంగం (విశ్రాంత ఉపాధ్యాయుడు, పద్మావతి, ఉపాధ్యాయురాలు) దంపతులు నిర్మాణం చేపట్టిన రేకుల షెడ్డును ప్రారంభారు. ఈ సందర్భంగా ఎంఈవో విజయకుమార్ మాట్లాడుతూ పొన్నురంగం కోదండరామాపురం ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తూ విద్యార్థులకు విద్యాబోధనలు అందించడమే కాకుండా వారికి కావాల్సిన నోటు పుస్తకాలు, విద్యా సామగ్రిని ప్రతి ఏటా అందించి పిల్లలు పెద్ద దిక్కుగా నిలిచే వారని గుర్తు చేశారు. అలాగే ఎమ్మార్పీ భవనానికి గతంలో తన సొంత నిధులు వెచ్చించి గేట్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఉద్యోగ విరమణ పొందిన కూడా విద్యా వ్యవస్థపై తమ దాతృత్వాన్ని చాటుకుంటున్న పొన్నురంగం సేవలను ఉపాధ్యాయులు కూడా ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఇలాంటి దంపతులు విద్యారంగంలో పని చేయడం అభినందనీయమని కొనియాడారు.

శ్రీ సాయి సన్నిధిలో సామూహిక శ్రీ సత్యనారాయణ స్వామి వ్రత పూజలు

విశాలాంధ్ర-సూళ్లూరుపేట: సూళ్లూరుపేట పట్టణంలోని పాలెం వద్ద ఉన్న శ్రీ సాయి సన్నిధి సత్సంగ మందిరంలో కార్తీక మాసంలో ప్రతి ఏటా శ్రీ సాయి సత్యనారాయణ స్వామి వ్రత పూజలు జరిపించడం జరుగుతుంది. ఈ వేడుకలో భాగంగా శనివారం ఆలయం ఆవరణం లో శ్రీ సాయి సామూహిక శ్రీ సత్యనారాయణ స్వామి వ్రత పూజలు జరిపించారు. వేదిక పైన శ్రీ సత్యనారాయణ స్వామి చిత్రపటాన్ని కొలువుతీర్చి కలిశా స్థాపన చేసి వేదపండితులు శాస్త్రోక్తముగా భక్తుల చేత సామూహిక శ్రీ సత్యనారాయణ స్వామి వ్రత పూజలు జరిపించారు. శ్రీ సాయి సన్నిధి సత్సంగ మందిరం కార్యనిర్వాహణ కమిటీ ఆధ్వర్యంలో ఈ పూజలు జరిపించడం జరిగింది.

తెదేపా మహిళ ప్రధాన కార్యదర్శి నాగరత్నం కుమారుడికి విజయబాబు ఆర్థిక సాయం

విశాలాంధ్ర-పుత్తూరు: తెలుగుదేశం పార్టీ నగరి నియోజకవర్గం మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి నాగరత్నం కుమారుడు ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురైన విషయం తెలిసిందే. ప్రమాదంలో అతని ద్విచక్ర వాహనం ధ్వంసమైంది. ఇందులో గాయపడిన ఆమె కుమారుడిని పరామర్శించడానికి వెళ్లిన తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పోతుగుంట విజయ్ బాబు ద్విచక్ర వాహనానికి ఎంత ఖర్చైనా మరమ్మతులు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ మేరకు సుమారు 20 వేల రూపాయల ఖర్చుతో ద్విచక్ర వాహనానికి మరమ్మతులు చేయించి శనివారం పట్టణంలోని ఎం.బి.రోడ్డులోని తన కార్యాలయం వద్ద నాగరత్నంకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పరమేశ్వర మంగళం ఎంపీటీసీ శ్రీజ బాలాజీ నాయుడు, టిడిపి రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి ఇ.రవి నాయుడు, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జి.ధనపాల్, సూపర్ బజార్ చైర్మన్ చంద్రయాదవ్, ఇంకా టిడిపి నాయకులు అనిల్ యాదవ్, పుష్పావతి, పోతుగుంట రమేష్, అములు, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

శివయ్య సేవలో హైకోర్టు న్యాయమూర్తులు

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తిలో వెలసిన వాయులింగేశ్వరస్వామిని శనివారం ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.గోపాలకృష్ణారావు, పట్నా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విపుల్ ఎం.పంచోలి కుటుంబ సభ్యులతో కలసి వేర్వేరుగా దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి టి.బాపిరెడ్డి వీరికి దక్షిణ గోపురం వద్ద ఆలయ సంప్రదాయాలతో స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వదించారు. అదేవిధంగా ముక్కంటి శేష వస్త్రంతో సన్మానించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో ఎన్.ఆర్.కృష్ణారెడ్డి, ఏఈవో సతీష్ మాలిక్, ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రబాబుకు ముక్కంటి ప్రసాదాలు

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు విజయ వాడ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం శ్రీకాళహస్తి మార్కెట్ మాజీ చైర్మన్ రంగినేని చెంచయ్యనాయుడు మర్యాద పూర్వకంగా కలసి శ్రీకాళహస్తీశ్వరస్వామి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అదేవిధంగా ముక్కంటి శేష వస్త్రంతో సన్మానించారు.

అభిషేకం చేయలేదనడం అబద్ధం

ముక్కంటి ఆలయ ఈవో బాపిరెడ్డి

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆలయానికి అనుబంధంగా శ్రీకాళ హస్తి పట్టణం ముత్యాలమ్మ గుడివీధిలో వెలసిన ఏడుగంగమ్మల ఆలయంలో కుంబాభిషేకం తరువాత అభిషేకం చేయలేదని కొందరు చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదని కార్యనిర్వహణాధికారి టి.బాపిరెడ్డి ఖండించారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఏడుగంగమ్మల ఆలయంలో శుక్రవారం ఉదయం 9 నుంచి 10.30 గంటల మధ్య శాస్త్రోక్తంగా కుంబాభిషేకం చేశామన్నారు. తదుపరి ప్రత్యేక అభిషేకాలు చేసి అలంకరణ చేశామన్నారు. అదే రోజు మధ్యాహ్నం కుంభం వేశామన్నారు. భక్తుల సౌకర్యార్థం శనివారం మధ్యాహ్నం వరకు ఏడుగంగమ్మల అమ్మ వారికి అలంకరణ అలాగే ఉంచామన్నారు. తదుపరి మధ్యాహ్నం 3 గంటలకు అమ్మ వారికి అభిషేకం నిర్వహించామన్నారు. అంతలోపే కొందరు భక్తుల మనోభావాలు దెబ్బతీసే విధంగా అబద్ధపు ప్రచారం చేశారన్నారు. వారి ప్రచారంలో వాస్తవం లేదన్నారు. భక్తులు ఇది గమనించాలని ఈవో బాపిరెడ్డి కోరారు.

జాతీయస్థాయి ఆర్చరీ స్కూల్ గేమ్స్ పోటీలకు శ్రీప్రగతి విద్యార్థిని నిష్విత

విశాలాంధ్ర - కోట: కోట పట్టణ పరిధిలోని శ్రీ ప్రగతి విద్యానికేతన్ విద్యార్థిని జాతీయస్థాయి అర్చరీ స్కూల్ గేమ్స్ పోటీలకు ఎంపికైంది. దీంతో పాఠశాల చైర్మన్ పసుపులేటి కిషోర్ విద్యార్థినిని అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈనెల 3,4,5 తేదీలలో మన్యంజిల్లా జోగింపేట గురుకులపాఠశాల ఆవరణలో జరిగిన 68వ స్కూల్ గేమ్స్ రాష్ట్ర స్థాయి ఆర్చరీ (విలువిద్య) పోటీలలో 8వ తరగతి చదువు తున్న విద్యార్థిని డి.నిష్విత అండర్-14 రికర్వ్ క్రీడావిభాగంలో సిల్వర్, బ్రంజ్ మెడల్స్ సాధించి అర్చరీ జాతీయ పోటీలకు ఎంపిక అయినట్లు తెలిపారు. ఈ జాతీయస్థాయి పోటీలు గుజరాత్ రాష్ట్రములోని నాదియాద్ డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఈ నెల 14వ తేదీ నుండి 20వ తేదీ వరకు జరుగుతాయనితెలియజేసారు. ఎంపికైన విద్యార్థి నిష్విత జాతీయ పోటీలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చాలని ఆర్చరీ కోచ్ టి.శివ శంకర్‌ని అభినం దించారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

సప్తవర్ణ శోభితం శ్రీవారి పుష్పయాగం

పుష్పార్చనతో పులకించిన తిరుమలకొండ

విశాలాంధ్ర-తిరుమల కల్చరల్: పవిత్రమైన కార్తీకమాసంలో శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని తిరుమల శ్రీవారి ఆలయంలో శనివారం పుష్పయాగ మహోత్సవం వైభవంగా జరిగింది. సువాసనలు వెదజల్లే 17 రకాల పుష్పాలు, 6 రకాల పత్రాలతో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారికి వేడుకగా పుష్పార్చన నిర్వహించారు. రంగురంగుల పుష్పాలు, పత్రాల మధ్య స్వామి, అమ్మవార్ల వైభవం మరింత ఇనుమడించింది. మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు పుష్పయాగ మహోత్సవం కన్నుల పండుగగా జరిగింది. స్వామి, అమ్మవార్ల ఉత్సవర్లను పట్టు వస్త్రాభరణాలతో అలంకరించి వేదమంత్రాల నడుమ పుష్పకైంకర్యం చేశారు. చామంతి, సంపంగి, నూరు వరహాలు, రోజా, గన్నేరు, మల్లె, మొల్లలు, కనకాంబరం, తామర, కలువ, మొగలిరేకులు, మానసంపంగి పుష్పాలు, తులసి, మరువం, దవణం, బిల్వం, పన్నీరు, కదిరిపచ్చ పత్రాలతో స్వామి, అమ్మవార్లను అర్చించారు. ఈ సందర్భంగా వేదపండితులు రుగ్వేదం, శుక్లయజుర్వేదం, కృష్ణ యజుర్వేదం, సామవేదం, అధర్వణ వేదాలను పఠించారు. పుష్పాధిదేవుడు "పుల్లుడు ఆవాహన పుష్పాలకు అధిపతి అయిన దేవుడు పుల్లుడిని ఆవాహన చేసి 20 సార్లు వివిధ రకాల పుష్పాలతో అర్చించారు. ఉత్సవమూర్తుల నిలువెత్తు వరకు ఉండేలా పుష్ప నివేదన చేపట్టారు. పుష్పయాగానికి మొత్తం 9 టన్నుల పుష్పాలు, పత్రాలను దాతలు అందించారు. ఉద్యానవన డెప్యూటీ డైరెక్టర్‌కు సన్మానం శ్రీవారి పుష్పయాగాన్ని ఘనంగా నిర్వహించేందుకు దాతల నుంచి పుష్పాలు సేకరించేందుకు కృషి చేసిన టీటీడీ ఉద్యానవన విభాగం డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులును ఆలయ అధికారులు శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి, డిప్యూటీ ఈవో లోకనాథం, పేష్కార్ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

తిరుమలలో వైభవంగా

పుష్పాలు ఊరేగింపు

విశాలాంధ్ర - తిరుమల కల్చరల్ : తిరుమల శ్రీవారి ఆలయంలో కార్తీక్త మాసం శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని నిర్వహించే పుష్పయాగానికి అవసరమైన పుష్పాల ఊరేగింపు శనివారం తిరుమలలో ఘనంగా జరిగింది. తిరుమలలోని కల్యాణవేదిక వద్ద గల ఉద్యానవన విభాగంలో ముందుగా పుష్పాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. టీటీడీ అడిషనల్ ఈవో సి.హెచ్. వెంకయ్య చౌదరి, శ్రీవారి ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం, ఉద్యానవన విభాగం డెప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు, ఉద్యానవన సిబ్బంది, శ్రీవారి సేవకులు కలిసి పుష్పాలను ఊరే గింపుగా శ్రీవారి ఆలయం వరకు తీసుకు వచ్చారు. ఈ సందర్భంగా అడిషనల్ ఈవో సి.హెచ్. వెంకయ్య చౌదరి మీడి యాతో మాట్లాడుతూ శ్రీవారి పుష్పయా గానికి శుక్రవారం సాయంత్రం శాస్త్రోక్తంగా అంకురార్పణ నిర్వహించినట్లు తెలిపారు. శ్రీవారి ఆలయంలో శనివారం ఉదయం 9 నుండి 11 గంటల నడుమ శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్ప స్వామివారికి వేడుకగా స్నపన తిరుమంజనం జరిగిందని చెప్పారు. మధ్యాహ్నం 2 నుండి 5 గంటల వరకు స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు శోభాయ మానంగా పుష్పయాగం జరుగుతుందన్నారు. ఇందుకోసం 17 రకాల పుష్పాలు, 6 రకాల పత్రాలను వినియోగిస్తామని చెప్పారు. తమిళనాడు నుంచి ఐదు టన్నులు, కర్ణాటక నుంచి రెండు టన్నులు, ఆంధ్రప్రదేశ్ నుండి రెండు టన్నులు కలిపి మొత్తం 9 టన్నుల పుష్పాలనుదాతలు విరాళంగా అందించారని వెల్లడించారు.

నకిలీ లోన్ యాప్‌లను మొబైల్‌లో ఇన్‌స్టాల్ చేయకండి

1930, సైబర్ మిత్ర 9121211100 సేవలను సద్వినియోగం చేసుకోవాలి : ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు

6వ రోజు కొనసాగిన సైబర్ క్రైమ్ నివారణ వారోత్సవాలు

విశాలాంధ్ర - పుత్తూరు: సైబర్ క్రైమ్ నివారణ వారోత్సవాలలో భాగంగా జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు ఆదేశాల మేరకు శనివారం ఉదయం పుత్తూరు డిఎస్పి జి.రవి కుమార్ ఆధ్వర్యంలో, సిద్ధార్థ ఇంజనీరింగ్ కాలేజీలో సైబర్ క్రైమ్ ప్రముఖ నిపుణులు ఐ.ఎల్.నరసింహారావు వారి చేత సైబర్ క్రైమ్ అవగాహన సదస్సులను ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా పుత్తూరు డిఎస్పి జి.రవికుమార్ మాట్లాడుతూ ఇటీవల కాలంలో ప్రపంచం మొత్తం సైబర్ క్రైమ్ రూపంలోనే ఎక్కువ మోసాలు జరుగుతున్నాయని, ఎక్కువగా మహిళలను టార్గెట్ చేసి మోసాలు చేస్తున్నారన్నారు. మన రాష్ట్రంలో లక్షకు పైగా ఈ సైబర్ మోసాలు జరుగుతున్నాయి. సైబర్ మోసాలు వల్ల మోసపోయిన బాధితులు ఎవరికి చెప్పుకోవాలో తెలియకుండా మదనపడుతూ, మానసికంగా నలిగిపోతూ, ఆత్మహత్యా యత్నాలు కూడా చేస్తున్నారన్నారు. తిరుపతి జిల్లా ప్రజలే కాకుండా తిరుపతికి వచ్చే భక్తులు కూడా ఈ అప్లికేషన్ సేవలను ఉపయోగించుకో వాలంటే మొబైల్ పోయినవారు 9490617873 అనే నెంబరుకు వాట్సాప్ ద్వారా హాయ్ అని మెసేజ్ చేస్తే వారికి ఒక గూగుల్ అప్లికేషన్ ఫామ్ వస్తుంది. తగిన వివరాలతో సహా పోయిన మొబైల్ వివరాలు నింపి పంపితే తిరుపతి సైబర్ క్రైమ్ పోలీసులు ఆ ఫిర్యా దులను స్వీకరించి పోయిన మొబైల్‌ను రికవరీ చేసి వారి స్వస్థలానికి సంబంధించిన పోలీస్ స్టేషన్‌కు పంపించి బాధితులకు అందజేస్తా మన్నారు. ఆధార్ అప్డేట్, బ్యాంకు నుండి కాల్ చేస్తున్నామని చెప్పి కాల్ చేసే అపరిచితులకు ఒటిపిలు చెప్పకూడదన్నారు. బ్యాంకు వారు ఎప్పుడు కూడా అటువంటి కాల్స్, మెసేజెస్ చేయరన్నారు. ఇలాంటి సమయంలో ఇంకిత జ్ఞానంతో ఆలోచించి నివారించా లన్నారు. పుత్తూరు డిఎస్పి మాట్లాడుతూ బ్యాక్ డోర్ ద్వారా ఉద్యోగం అంటూ నకిలీ వెబ్ సైట్లు లేదా మరే ఇతర వెబ్ సైట్ అంటూ వచ్చే ఫోన్ కాల్స్, ఇ-మెయిల్స్ కు రిప్లై ఇవ్వరాదు. అందమైన అమ్మాయిల/అబ్బాయిల వంటి సోషల్ మీడియా ప్లాట్ ఫారంలో పరిచయమైన వారు చేసే వీడియో కాల్‌ను నమ్మవద్దన్నారు. సైబర్ క్రైమ్ ప్రముఖ నిపుణులు ఐ.ఎల్.నరసిం హరావు మాట్లాడుతూ నేటి తరం చిన్న పిల్లల నుండి పెద్దల వరకు సైబర్ నేరాలపై సరైన అవగాహన లోపం కారణంగా సులభంగా సైబర్ నేరగాళ్ల చేత మోసపోతున్నారని, ప్రస్తుత కాలంలో ఈజీ మనీకి అలవాటు పడిన కొంత మంది సైబర్ నిపుణులు ఈ సైబర్ నేరాలను చేస్తూ అమా యక ప్రజలను దోపిడీ చేస్తున్నారు. వీటిపై ప్రజలకు అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో తన వంతు ప్రేరణగా జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమాలలో సిఐలు, సురేంద్ర నాయుడు, పుత్తూరు అర్బన్, జి.రవీంద్ర, సీఐ పుత్తూరు రూరల్ సర్కిల్, ఎస్సైలు కె.రాజశేఖర్, నారాయణవనం పోలీస్ స్టేషన్ వెంకటేశ్వర్లు పిచ్చాటు రూ పీస్, సైబర్ ల్యాబ్ సిబ్బంది మరియు సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్, ప్రొఫెసర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.